

టెన్త్ పరీక్షార్థులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

టీవీకి దూరంగా ఉండండి

పాఠ్యాంశాలపై పట్టు సాధించండి

పది పరీక్షార్థులకు కలెక్టర్ సూచనలు

ఏలూరు అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు సమీపించాయి. విద్యార్థుల టీవీకి దూరంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. పాఠ్యాంశాలపై ఉపాధ్యాయుల సూచనలనుపాటిస్తే అందరూ ఉత్తీర్ణులవుతారని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరుకానున్న ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె ముచ్చటించారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ రెండు నెలలు టీవీకి దూరంగా ఉండాలని, టెక్స్‌బుక్స్ విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను బాగా అభ్యసిస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో నేరుగా సంభాషించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఏలూరుసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధికి బ్యాంకర్లు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 1901 స్వయం ఉపాధి పథకం యూనిట్లు ఏర్పాటుకు రూ.36.49 కోట్లు మంజూరయ్యా యన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధి పథకంలో రూ. 25.91 కోట్లతో 750 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరుచేసి యువత స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కోడి పందేలు నిర్వహించడం నేరం

కోడి పందేలు నిర్వహించడం నేరమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కోడింపందేల నిషేధ పోస్టర్‌ను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. సంక్రాంతికి కోడిపందేలను నిరోధించే చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ, పోలీసు, రెవెన్యూ అధికారుల బృందాలు గ్రామస్థాయిలో కోడిపందేల నిరోధంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తాయన్నారు.

కొల్లేరు ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలి

కొల్లేరు నాయకుల సమావేశం

కైకలూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి):కొల్లేరులో ఫారెస్ట్ అధికారులు చెరువులకు గండ్లు పెట్టడంతో ఉపాధి లేక వలసలు పోవల్సి వస్తుందని రాష్ట్ర వడ్డీ సాధికారిత సమితి కన్వీనర్ బలే ఏసురాజు, కొల్లేరు సంఘ నాయకుడు సైదు సత్యనారాయణ అన్నారు. కైకలూరులో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కొల్లేరు సంఘ నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. 2006 కొల్లేరు ఆపరేషన్‌తో ప్రజల జీవనోపాధిని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని, గ్రామాల్లో 60-70శాతం ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి పోయారన్నారు. అప్పుడు ధ్వంసం చేసిన చెరువుల్లో కొద్ది నీరు నిలబడి అడుగు పట్టుబడుల ద్వారా వేసవిలో వచ్చే డబ్బుతో స్థానికులకు తిండి దొరుకుతుందన్నారు. వాటికి కూడా గండ్లు పెడితే ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేసి వలస పోవలసిందేనన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరు ప్రజల ఆందోళనను గుర్తించి మత్స్యకారులు జీవనానికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పెన్మెత్స త్రినాథరాజు, ముంగర మల్లికార్జునరావు, కొల్లి వరప్రసాద్, కొల్లేరు గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో

రైతు ఆత్మహత్య

పెదవేగి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు రైతు ఉసురు తీశాయి. ఆరుగాలం చేసిన కష్టం అప్పులు తీర్చడానికికూడా రాకపోవడంతో ఆ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పెదవేగి మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన చిలకలపూడి చెన్నకేశవరావు తన 1.30 ఎకరాలతోపాటు మరికొంత భూమి కౌలుకు సాగు చేస్తున్నాడు. సాగులో నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. దాదాపు రూ.6లక్షల అప్పు తీర్చే మార్గం కనిపించక కొద్దిరోజులుగా మదనపడుతున్నాడు. భార్య వరలక్ష్మితో మాట్లాడితే నిదానంగా అప్పు తీర్చేసుకుందాం బెంగపెట్టుకోవద్దని ధైర్యం చెప్పారు. గత ఆదివారం రాత్రి 11గంటల సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన భార్య వరలక్ష్మి గ్రామస్తుల సహాయంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చెన్నకేశవరావు(55) సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కృషి పండిట్ నెక్కంటికి రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం 6
శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు
హెచ్ఎంపీవీ వైరస్‌పై అప్రమత్తం 7

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతాన్ని మురిపిస్తున్నాయి. చాన్నాళ్లుగా రోడ్డెక్కాలంటే ఈ ప్రాంతవాసులు హడలిపోయేవారు. ప్రమాదాల్లో గాయపడని వాహనదారులు ఉండేవారు కాదు. ఏటా పెద్ద సంఖ్యలో క్షతగాత్రులు నమోదయ్యేవారు. 2014-19 మధ్య పోలవరం పనులు వేగంగా సాగుతున్నప్పుడు జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు మరో మార్గం ఏర్పాటైతే అత్యద్భుతం అంటూ అప్పట్లో చర్చ సాగింది. దీనిపై కసరత్తు చేయాల్సిందిగా అధికారులకు సంకేతాలు అందాయి. కాని అప్పట్లో అందరి మదిలో మెదిలినట్టుగా ఇప్పుడు ఆ కల సాకారం కాబోతుంది. జీలుగుమిల్లి నుంచి కొత్త పట్టిసీమ వరకు కొత్తగా జాతీయ రహదారి నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. కొత్తగా తలపెట్టిన ఈ మార్గం పనులను బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

ఏజెన్సీ ప్రాంతానికి కొత్త దారి

జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు హైవే నిర్మాణం



నేడు ప్రధాని శంకుస్థాపన చేయనున్న పనుల శిలాఫలకం

- రూ.369 కోట్లతో 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణం
- నేడు వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హాజరుకానున్న ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లాలో వరుసగా అద్భుతాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని ప్రాంతాల్లో గుంతలులేని రహదారులను తీర్చిదిద్దేందుకు సంకల్పించారు. తాజాగా జీలుగుమిల్లి నుంచి కొత్త పట్టిసీమ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారిని నిర్మించబోతున్నారు. దీని ద్వారా తెలంగాణ సరిహద్దుల నుంచి రాజమహేంద్రవరం చేరేందుకు సమయం, ప్రయాణం కలిసి వస్తుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాగుతున్న తరుణంలో నూతన మార్గం ప్రాజెక్టు పనులు మరింత విస్తృతంగా సాగేలా దోహదపడబోతుంది. జీలుగుమిల్లి నుంచి కొత్త పట్టిసీమ వరకు దాదాపు 40 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. జాతీయ రహదారి 365 బిబి పరిధిలోకి వస్తుంది. దీని నిర్మాణ వ్యయం దాదాపు రూ.369 కోట్లు. జీలుగుమిల్లి మండలం సరిహద్దున తెలంగాణ పరిధిలోని అశ్వారావుపేటను దాటి తాటాకుల గూడెం, జీలుగుమిల్లి, బర్రింకలపాడు, పి.అంకంపాలెం, రౌతుగూడెం మీదుగా బుట్టాయిగూడెం మండలంలోకి ప్రవేశించి ఎల్ఎన్‌డీ పేట మీదుగా పట్టిసీమ వద్ద గోదావరి గట్టు వరకు సాగుతుంది. ఈ క్రమంలో అక్కడక్కడ భూసేకరణకు పెద్ద ఇబ్బందులు లేకుండా ఇప్పటికే జాగ్రత్త పడ్డారు. ఇంతకుముందు పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నప్పుడు భారీ మిషనరీ, కావాలసిన సామగ్రి పోలవరం చేర్చేందుకు వ్యయప్రయాశలకోర్చేవారు. దానికంటే మించి హైదరాబాదు మీదుగా వచ్చే వారు ఎవరైనా చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది. దీనిని గమనించి తెలంగాణలోని అశ్వారావుపేట నుంచి జీలుగుమిల్లి, పట్టిసీమ వరకు ప్రత్యేక మార్గాన్ని విస్తరిస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు అందాయి. దీనికి సాధ్యమైనంత అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నం చేసినా కార్యరూపం దాల్చలేదు. అప్పటి అంచనాల మేరకు తాజాగా 40 మీటర్ల జాతీయ రహదారి నిర్మించబోతున్నారు. అనేక చోట్ల కల్వర్టులు కట్టాల్సి వచ్చినా వాగులు, వంకలు దాటుకుని పట్టిసీమ వరకు రహదారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటిదాకా అనేక సమస్యలు రోడ్డు మార్గాల ద్వారానే వచ్చి పడుతూనే ఉన్నాయి. ఏళ్ల తరబడి దెబ్బతిన్న మార్గాలను వైసీపీ హయాంలో మరింత నిర్లక్ష్యం చేయడంతో మారు మూల గ్రామాల నుంచి కనీసం మండల కేంద్రానికి వెళ్లేందుకు కూడా అనువైన మార్గాలే లేకుండా పోయాయి. గిరిజనులు, గిరిజనేతరవర్గాలు అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి విన్నవించినా దిక్కుమొక్కు లేకుండా పోయింది.

కల ఫలించేలా..

ఏజెన్సీవాసులు మెచ్చేలా కేంద్రం 365 బిబి జాతీయ రహదారిని విస్తరించేందుకు కొన్నాళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జీలుగుమిల్లి మీదుగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం సాగాల్సి ఉండగా దీనిపై సర్వే కూడా నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ ప్రాంతాన్ని పదేపదే పరిశీలించారు. రానున్న రెండేళ్లలో ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు సంకల్పించారు.



రహదారి పనుల ప్రణాళికపై అధికారులతో చర్చిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి(ఫైల్)

నేడు పనులు ప్రారంభం

ఈ పనులను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ హాజరవుతారు. ఈ రహదారి నిర్మాణంతో బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో సరికొత్త అధ్యాయం ఆరంభం కానుంది. ఇప్పటిదాకా గుంతలు తేలిన రోడ్లతోనే నానా తిప్పలు పడిన వారంతా జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ చేరేందుకు అతి తక్కువ సమయం పట్టడమే కాకుండా ప్రయాణం, రవాణ కూడా సులువు కాబోతుంది. ఇప్పటికే 365 బిబి మార్గాన్ని మరింత విస్తరించే క్రమంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త పట్టిసీమ నుంచి గోదావరి గట్టును మరింత పటిష్టం చేసి ఈ మార్గానికి అనుసంధానం చేయబోతున్నారు. ఇది పూర్తయితే నేరుగా రాజమహేంద్రవరం చేరేందుకు రవాణా, ప్రయాణికుల వాహనాలకు అత్యంత సులభతరమవుతుంది. సత్తుపల్లి నుంచి జీలుగుమిల్లి మండలం మీదుగా విస్తరిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఇప్పుడు సమాంతరంగా జీలుగుమిల్లి-2 పట్టిసీమ జాతీయ రహదారి పనులు పూర్తయితే జీలుగుమిల్లితోపాటు ఏజెన్సీ ప్రాంతానికి సరికొత్త కళ వచ్చినట్టే. ఈ ప్రాంత అభివృద్ధికి ఈ రెండు మార్గాలే దోహదం కాబోతున్నాయి.

అక్రమ క్వారీయింగ్

- పాత రశీదులతో తవ్వకాలు
- నిరూపిస్తామంటున్న గన్నవరం తెలుగు తమ్ముళ్లు
- నూజివీడు టీడీపీ శ్రేణుల వ్యాఖ్యలు బూమరాంగ్

గన్నవరం x నూజివీడు



కనసానపల్లిలో అక్రమ క్వారీ నుంచి వస్తున్న టిప్పర్

నూజివీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు-గన్నవరం నియోజకవర్గాల తెలుగు తమ్ముళ్ల మధ్య ప్రచ్ఛన్న పత్రికా ప్రకటనల యుద్ధం రెండు రోజులుగా సాగుతోంది. ఈ యుద్ధానికి నేపథ్యం అక్రమ మైనింగ్ వ్యవహారం. క్వారీలకు కొత్తగా ఎలాంటి అనుమతులు లేకున్నా, గతంలో ఇచ్చిన అనుమతుల మేరకు తవ్వకం పూర్తయిన క్వారీల నుంచి గ్రావెల్, మట్టి తరలిపోతోంది. నూజివీడు నియోజకవర్గంలోని కనసానపల్లి ఆర్ఎస్ నెం 117 నుంచి, తిరువూరు నియోజకవర్గ పరిధిలోని కొండపర్వ గ్రామంలోని ఒక ప్రైవేట్ మామిడితోటలోని గట్టు నుంచి గన్నవరం నియోజకవర్గంలోకి అక్రమంగా టిప్పర్లతో గ్రావెల్, మట్టి తరలిపోతోంది. కొందరు నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు, పెనమలూరు నియోజకవర్గానికి చెంది గతంలో వైసీపీ నాయకులతో కలిసి ఈ అక్రమ క్వారీయింగ్ జరుగుతోంది. టిప్పర్లు గన్నవరం మాజీ ఎమ్మెల్యే అనుచరులివి కావడంతో, ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ నెల 5న నిరసన గళం విప్పడంతో విషయం వెలుగుచూసింది. ఎమ్మెల్యే వెంకట్రావు ప్రకటనను ఖండిస్తూ నూజివీడు గ్రామస్థాయి నాయకులు మీడియాకు ఎక్కారు. దీనిపై గన్నవరం టీడీపీ నాయకులు ఈ అక్రమ మైనింగ్‌లో ఆధారాలు, పేర్లతో వెల్లడించడంతో నూజివీడు తెలుగు తమ్ముళ్లు డిఫెన్స్‌లో పడ్డారు. నూజివీడు వచ్చి అయినా రుజువులు చూపిస్తామంటూ గన్నవరం తెలుగు తమ్ముళ్లు చేసిన ప్రకటన ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కూటమి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారే. వీరిలో ఒకరు పార్థసారథి మంత్రి కాగా, మరొకరు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు. ఒకే పార్టీ అయినప్పటికి వీరి మధ్య కొంత ఎడముఖం, పెడముఖంగా వ్యవహారం సాగుతోంది. రెండు, మూడు నెలల క్రితం గన్నవరం నియోజకవర్గ పరిధిలోని నేషనల్ హైవేపై ఉన్న టోల్‌గేట్ టెండర్ వ్యవహారంలో వీరి మధ్య వివాదం ఏర్పడి, అది సీఎం వరకు వెళ్లింది. చంద్రబాబు ప్రమాణ స్వీకారం గన్నవరం పరిధిలో భారీ స్థాయిలో జరిగింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే భూమి చదును చేయడం, బాగు చేయడం కోసం దాదాపు రెండు కోట్ల 80 లక్షలతో పనులు జరిగాయి. ఈ పనులను వైసీపీకి చెందిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆధ్వర్యంలో జరిగాయని, ఆ బిల్లులను సైతం ఆగమేఘాల మీద మంజూరు చేసినట్లు గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు ఇప్పుడు చెబుతున్నారు. నాడు ఆ పనులు జరిగేటప్పుడు ఆయన రెండు, మూడు సార్లు స్వయంగా పర్యవేక్షించారు. అప్పుడే ఆయన దీనిపై అభ్యంతరాలు తెలిపి ఉంటే బావుండేదని నూజివీడు తెలుగు తమ్ముళ్లు ఇప్పుడు చెబుతున్నారు. ఆ పనులను సీఎం పేషీ నుంచి పర్యవేక్షించారు. సమయాభావం దృష్ట్యా ఆ పనులు త్వరితగతిన జరగాల్సివుంది కాబట్టి ఎవరూ ఈ విషయాన్ని గమనించలేదు.

ఆగని క్వారీయింగ్

రెండు రోజుల నుంచి అక్రమ క్వారీయింగ్‌పై వివాదం జరుగుతున్నా కనసానపల్లి క్వారీ నుంచి గ్రావెల్ సోమవారం తరలి వెళుతోంది. 2017-18లో ఈ కనసానపల్లి క్వారీ పరిమితికి తీసుకుంది ఏడు ఎకరాలు. ఇప్పటికి తవ్వింది 14 ఎకరాలు. ఏడు ఎకరాలకు సమీపంలోని డి ఫాం పట్టాలు సైతం కొనుగోలు చేసి ఏడెకరాల పేరుతో అక్రమ క్వారీయింగ్ జరుగుతోంది. 2023లో ఈ విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో అధికారులు విచారణ చేసి అక్రమ క్వారీయింగ్‌ను ఆపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రెండు నెలల నుంచి మళ్లీ తిరిగి ఈ అక్రమ క్వారీయింగ్‌కు తెరలేచింది. ప్రస్తుత ఈ అక్రమ క్వారీయింగ్‌లో మంత్రి అయిన కొలుసు పార్థసారథి అనుచరులు ఉండడంతో ఆయనకు తెలిసి జరిగినా, తెలియక జరిగినా ఇప్పుడు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది.

నూజివీడు తెలుగు తమ్ముళ్ల ప్రెస్‌మీట్ బూమరాంగ్

అనాలోచితంగా ఆదివారం నూజివీడు టీడీపీ స్థానిక నాయకులు, గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు చేసిన ఆరోపణలను ఖండిస్తూ నిర్వహించిన ప్రెస్‌మీట్ భూమరాంగ్ అయింది. గన్నవరంలో తెలుగుదేశం ముఖ్య నాయకులు అక్రమ క్వారీయింగ్ నిర్వహిస్తున్న మంత్రి అనుచరుల పేర్లు, రశీదులతో సహా రుజువులు చూపుతూ, నూజివీడు నియోజకవర్గంలో క్వారీయింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వచ్చి తాము నిరూపిస్తామంటూ పత్రికా ముఖంగా చెప్పడంతో గన్నవరం వర్సెస్ నూజివీడు నియోజకవర్గ తెలుగు తమ్ముళ్ల ప్రచ్ఛన్న యుద్ధం అనే పరిస్థితికి ప్రస్తుత క్వారీయింగ్ వ్యవహారం తీసుకువెళ్లింది.

కొడుకును చంపిన తండ్రి

మద్యానికి డబ్బులివ్వలేదని తండ్రిపై దాడి

రోకలితో కొట్టి హతమార్చిన తండ్రి

నూజివీడు టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొడుకు మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం రోజూ తండ్రిని వేధిస్తున్నాడు. మంగళవారం ఇలానే వేధించడంతో మాటా మాటా పెరిగి తండ్రిపై కర్రతో దాడికి ప్రయత్నించాడు. ప్రతిఘటిస్తూ తండ్రి కొడుకును రోకలి బండతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబంధంలో జరిగింది. గోవింద్, అతని కుమారుడు నాగభూషణం (35) రోజు పనులు చేసుకునే కూలీలు. ఇద్దరూ పనుల్లోకి వెళ్లి సంపాదించుకుంటారు. తండ్రి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని నెట్టుకువస్తుంటే.. కుమారుడు మద్యం సేవిస్తుంటాడు. ఇంకా డబ్బులు కావాలని తండ్రిని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలోనే గోవింద్ డబ్బులు లేవని చెబుతూ కోపగించుకోగా నాగభూషణం తండ్రిపై కర్రతో దాడికి యత్నించాడు. నాగభూషణం పక్కనే ఉన్న రోకలి బండతో నాగభూషణాన్ని కొట్టగా తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలో అప స్మారక స్థితికి చేరుకున్నాడు. నాగభూషణాన్ని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో గాయాలతో నాగభూషణం

రబీ ప్రణాళిక రెడీ

- జిల్లాలో 98,798 ఎకరాల్లో వరి సాగు
- విత్తనాలు, ఎరువులు సిద్ధం



ఏలూరు సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగు ప్రణాళిక సిద్ధమైంది. సాధారణ విస్తీర్ణానికి అనుగుణంగా 98,798 ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించారు. 4,940 ఎకరాల్లో వరి నారుమడులు వేయాల్సి ఉండగా 3,500 ఎకరాల్లో నారుమడులు వేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారుల నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 3,864 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్టు చెబుతున్నారు. రైతుల అవసరాల మేరకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచారు. 29,639 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటివరకు 20 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ జరిగింది. రబీలో ఎంటీయూ 1121, పీఆర్ 126 రకాల వరి విత్తనాలు ఎక్కువగా సాగు జరుగు తుందని చెబుతున్నారు. రబీ సీజన్‌లో 1,40,374 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటివరకు 43,033 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేశారు. మార్క్‌ఫెడ్, ఇతర ప్రైవేటు డీలర్ల వద్ద ఈ ఎరువులు లభ్యమవుతున్నాయి. జిల్లాలో ఉన్న అవసరాల మేరకు ఎరువులు సరఫరా చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో సాగు సక్రమంగా సాగితే ఎకరాకు 3.2 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

ప్రణాళిక మేరకు సాగు

హబీబ్‌బాషా, వ్యవసాయ శాఖాధికారి

రబీ ప్రణాళికలో పేర్కొన్నవిధంగా రబీ సీజన్ ఆరంభమైంది. జిల్లాలో రబీకి అనుకూలమైన వరి వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో అవసరాలకు సరిపడా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశాం. జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేదు. రబీలో సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖాధికారులు సమీక్షిస్తున్నారు.

చిట్..చాట్

చంద్రబాబు అంటేే అభిమానం

ఆయనను అంతా ఆచంట చంద్రబాబునాయుడు అంటారు. రూపంలో చంద్రబాబునాయుడిని పోలి ఉండడంతో అలా పిలుస్తుంటారు.. వస్త్ర ధారణ, నడత, నడక చంద్రబాబుని తల పిస్తారు. ఆచంట చినపేటకు చెందిన ఆండ్రు లక్ష్మణ్ తెలుగుదేశం పార్టీ అభిమాని.ఎక్కడ పార్టీ కార్యక్రమాలు జరిగినా ఆయన అక్కడ ప్రత్యక్షమ వుతారు.. వ్యవయసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఆయనకు పార్టీ అంటే చాలా అభిమానం.. దాదాపు 25 ఏళ్లుగా పార్టీలో ఉంటూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.. చంద్రబాబు డూప్‌గా పిలిచే ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు చెప్పారు..

ఆచంటలో చంద్రబాబు డూప్..



• 25 ఏళ్లుగా పార్టీకి సేవలు

సుమారు 25 సంవత్సరాల క్రితమే పార్టీలో చేరాను. అప్పటి నుంచి కార్యకర్తగా పని చేస్తూ పార్టీకి సేవలంది స్తున్నాను. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి కార్యక్రమాలకు ఆకర్షి తుడినయ్యాను. ఆయనన్నా ఆయన విధా నాలన్నా నాకు చాలా ఇష్టం..ఆయనలా మాట్లాడడం, వస్త్రధారణ చేస్తూ పార్టీ సభలకు వెళ్లేవాడిని.

• పార్టీలకు ఆయనలా మేకప్ అయి వెళుతుంటా..

1998 నుంచి అపుడప్పుడు చంద్రబాబు నాయుడులా వేషధారణ వేసి క్రిస్మస్ కార్యక్ర మాల్లో పాల్గొనేవాడిని..ఆయనలా మాట్లాడుతూ హావభావాలు వ్యక్తం చేస్తూ జనాలను ఆకర్షించేవాడిని. అప్పటి నుంచి క్రిస్మస్, బర్త్‌డే పార్టీ కార్యక్రమాల్లో చంద్ర బాబు వేషధారణలో హాజరయ్యేవాడిని. సొంత ఖర్చులతో గన్‌మేన్లలా కొందరిని ఏర్పాటు చేసుకుని నిజంగానే చంద్రబాబు వచ్చారా అన్నట్టుగా పార్టీలకు హాజరవు తుండేవాడిని. మేకప్ అంటే ప్రత్యేకంగా ఏమీ ఉండదు.. ఇంటి దగ్గర ఉంటే వాటినే వేసు కుంటాను.

• చంద్రబాబు,లోకేశ్ అభినందించారు..

చంద్రబాబునాయుడిని చాలాసార్లు కలిశాను. 2019లో తణుకులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన వేషం వేసుకుని క లిశాను. ఆయన నవ్వుతూ నన్ను అభినందిం చారు. లోకేశ్‌ను కూడా కలిశాను. యువ గళం పాదయాత్రలో చంద్రబాబు గెటప్‌తో వివిధ ప్రాంతాల్లో నేను కూడా పాల్గొన్నాను. లోకేశ్ కూడా నన్ను చాలా అభినందించారు. మొన్న డిసెంబరు 26న ఒక కార్యక్రమంలో లోకేశ్ ట్విట్టర్‌లో నన్ను అభినందించాను.

• కూలిపనులు చేసుకుంటూనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటా..

ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, అభిమానులు నేను వేస్తున్న గెటప్‌ను చూసి అభినందించేవారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా లను నేను వినూత్నంగా సైకిల్‌పై ప్రచారం చేస్తుంటాను. కూలిపనులు చేసుకుని జీవించే నేను పార్టీ అభిమానంతో చంద్రబాబు వేష ధారణతో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటు న్నాను. పార్టీ గుర్తించి సాంస్కృతిక విభా గంలో పదవి కల్పించి నన్ను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుకుంటున్నాను.





చంద్రబాబు వేషధారణలో వివిధ పార్టీల్లో పాల్గొన్న లక్ష్మణ్

మన పొలంలో..

అగ్రి కల్చర్

బెంగాలీ కూలీలు



తేతలి పొలంలో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

గతంలో మహిళా కూలీలతో నాట్లు
స్థానికంగా ఉపాధి మార్గాలు పెరగడంతో కూలీల కొరత
పదేళ్లుగా బెంగాల్ నుంచి వలస
95 శాతం నాట్లు వారితోనే
ఖర్చులు కూడా తక్కువ

తణుకు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి ధాన్యాగారంగా నిలిచే ఉభయ గోదావరి జిల్లాల్లో వరి నాట్లు వేసే పనిలో బెంగాలీ కూలీలు పూర్తి ఆదిపత్యం వహిస్తు న్నారు. ఉభయ గోదావరి జిల్లా వ్యవసాయంలో వరి సాగుకే ప్రాధాన్యం దక్కుతుంది. మన వ్యవసాయ భూముల్లో ఒకప్పుడు వరినాట్లను మహిళలే నాటేవారు. వివిధ ఉపాధి మార్గాలు రావడంతో పాటు స్థానికంగా చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు వడంతో మహిళలు అందులో చేరిపోతున్నారు.. దీంతో వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. ఈ సమయంలో ఇతర ప్రాంతాలకు చెందిన కూలీల అవసరం ఏర్పడింది. మన రాష్ట్రానికి ఒడిశా, బిహార్, బెంగాల్ రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన కూలీలు వ్యవసాయంతో పాటు వివిధ రంగాల్లో ఉపాధి నిమిత్తం మన రాష్ట్రంలోని వివిధ పట్టణాలు, నగరాలకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. అయితే వ్యవసాయ రంగానికి సంబంధించి ముఖ్యంగా వరినాట్లు వేసేందుకు బెంగాలీ కూలీలకు మన ప్రాంతంలో డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాల్లోని వరినాట్లు సుమారు 95 శాతం నాట్లు బెంగాలీ కూలీల ద్వారానే జరుగుతున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నైపుణ్యంతో వరినాట్లు వేయడంతో పాటు ఖర్చు కూడా తక్కువ అవుతుండటంతో రైతులు కూడా బెంగాలీ కూలీలతోనే నాట్లు వేయించుకుంటున్నారు..

• బెంగాల్ నుంచి ఇక్కడకు..

మన ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వరినాట్లు వేసేందుకు పది సంవత్సరాల నుంచి బెంగాలీ కూలీలు వస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కోత్‌కతా, కలితులా, సిలిగురి, బసంత్, గుసవ, పార్చలీ జిల్లాలకు చెందిన అక్కడ వ్యవ సాయంలో ఉపాధి లేక ఆంధ్రప్రదేశ్‌కు వ్యవ సాయ పనుల కోసం వలస వస్తున్నారు. ఇక్కడ కొంతమంది మధ్యవర్తుల సహాయంతో వరి పంటకు సంబంధించిన సార్వా, దాళ్వా సీజ న్‌లలో రెండు, మూడు నెలల పాటు పనులు చేసుకునేందుకు ఇక్కడకు వస్తున్నారు. సుమారు 2 వేల మంది వరకు ఉమ్మడి పశ్చిమలో నాట్లు వేస్తున్నారు. వీరు ఒక్కో జట్టుగా వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. జట్టుకు 30 నుంచి 50 మంది సభ్యులతో తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, భీమవరం, ఉండి, ఆకివీడు, అత్తిలి, వంటి ప్రాంతాలకు వచ్చి అక్కడ తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసుకుని పనులు చేసుకుంటు న్నారు. అక్కడ కంటే ఇక్కడ వారికి మెరుగైన వేతాలు అందుతున్నాయని కూలీలు పేర్కొంటు న్నారు. ఇక్కడ పనుల చేసేందుకు వాతావరణం బాగా వుందని చెబుతున్నారు. ఒక్కో జట్టు రోజుకు 10 ఎకరాల నుంచి 12 ఎకరాలలో వరి నాట్లు వేస్తారు. భూమి విస్తీర్ణాన్ని వీరు సెల్ ఫోన్‌లో యాప్ ద్వారా తెలుసుకుని దాని ఆధా రంగా కూలి డబ్బులు తీసుకుంటారు. దీని వల్ల కొన్ని సందర్భాల్లో వీరి లెక్కల ద్వారా రైతుల తమ భూమి విస్తీర్ణం వివరాలు తెలిసి రెవెన్యూ అధికారులను అడిగి సరి చేసుకున్న సందర్భా లున్నాయి.

• నాట్లు వేయడంలో నైపుణ్యం

బెంగాలీ కూలీలు వరి నాట్లు వేయడంలో నైపుణ్యం కలవారు. నాట్లు ఒక వరుస క్రమంలో వుంటాయి. వీటి ద్వారా పొలంలో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం సుల భంగా వుంటుందని రైతుల అభిప్రాయం. బెంగాలీ కూలీల నాట్లు వేయడానికి ఎకరానికి 12 కిలోల విత్తన నారు సరిపోతుంది. అదే మన కూలీలు నాట్లు వేయాలంటే 25 కిలోల విత్తనాల నారు అవసరం అవుతుందని చెబుతున్నారు. బెంగాలీ కూలీలు ఒక ఎకరానికి నలుగురు సరి పోతారు. వీరు నారు తీసిన నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.3500 నుంచి రూ. 4 వేల వరకు తీసుకుంటుండగా, ఇక్కడ వారితో అయితే రూ. 5 వేల నుంచి రూ6 వేల వరకూ ఖర్చు అవు తుంది. అంతేకాకుండా ఎకరానికి 10 మంది మహిళలు, వారికి నారు అందించేందదుకు మరో ముగ్గురు మగ కూలీలు అవసరమవుతారు. మనవాళ్లు దూరం దూరంగా నాట్లు వేయడంతో నారు కూడా ఎక్కువ అవసరం అవుతుంది.

95 శాతం నాట్లు బెంగాలీ కూలీలవే ...



ఉభయ గోదావరి జిల్లాల్లోని వ్యవ సాయంలో బెంగాలీ కూలీలే 95 శాతం వరి నాట్లు వేస్తున్నారు. యంత్రాల ద్వారా 1 శాతం, స్థానిక కూలీల ద్వారా 3 శాతం మాత్రమే నాట్లు వేస్తారు. బెంగాలీ కూలీలు యంత్రాలతో సమానంగా వరినాట్లు వేస్తున్నారు. వీరు వేసే నాట్లు ఒక క్రమ పద్ధతిలో ఒక వరసు క్రమంలో రైతులు ఎరువులు, పురుగు మందుల పిచికారీకి వీలుగా బాటులు వేసినట్లుగా వుంటుంది. వీరు మొత్తం పురుషులే నారు తీసి, దానిని చేలోకి మోసుకెళ్లి నాట్లు వేస్తారు. అందువల్ల రైతులు కూడా బెంగాలీ నాట్లు వైపే మొగ్గు చపుతున్నారు.

-ఎంవీ రమేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, తణుకు

ఖర్చు.. శ్రమ తక్కువ



బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయడం వలన వారే నారు తీసి, నాట్లు వేయడం వల్ల రైతు లకు ఖర్చులు, శ్రమ తగ్గుతాయి. బెంగాలీ కూలల నాట్ల వల్ల మధ్యలో చేలలో ఎరువులు, పురుగు మందుల పిచికారీకి ఎలాంటి ఇబ్బందులుండవు. పల్లపు పొలాల్లో బెంగాలీ కూలీలతో నాట్లు వేయడం చాలా సులభంగా వుంది.

-ఎన్ శ్రీనివాసరాజు, తేతలి, రైతు

నాట్లు త్వరగా పూర్తవుతున్నాయి



బెంగాలీ కూలీల ద్వారా వ్యవసాయంలో వరినాట్లు త్వరిత గతిని పూర్తవుతున్నాయి. వీరిని బెంగాల్ నుంచి నెల రోజుల ముందు జట్టుగా కొంత సొమ్ము చెల్లించి తీసుకువస్తున్నాం. వీరు ఎకరానికి రూ. 4 వేల వరకు వసూలు చేస్తున్నారు. బెంగాలీ కూలీల ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో పనులు పూర్తికావడంతో రైతులు వీరితో నాట్లు వేయించుకునేందుకు మక్కువ చూపుతున్నారు.

-కోనా బాబీ, తణుకు, బెంగాలీ కూలీల మధ్యవర్తి

ఇక్కడ ఎక్కువ కూలీ వస్తుంది



వరి నాట్లు వేసేందుకు గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడకు వస్తున్నా. వరినాట్లు ద్వారా మంచి ఆదాయం పొందుతున్నా. ఇక్కడ వాతావరణం చాలా బాగుంది. మా ప్రాంతం కలితులాలో ఎక్కువగా గోదుమ పంట సాగు చేస్తున్నారు. అక్కడ పనులు తక్కువే, ఆదాయం కూడా తక్కువే.

-బిషోయ్ జిత్, బెంగాలీ కూలీ



తణుకు జాతీయ రహదారి పక్కన బెంగాలీ కూలీలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్లు

ఆధునిక వైద్యానికి కేరాఫ్‌గా..

స్కాన్



100 పడకలకు అప్‌గ్రేడ్ అయిన నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి

ఇటీవల నరసాపురంలో ఒకరికి గుండెపోటు వచ్చింది . ఆర్థిక స్తోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసు కొచ్చారు. ఈసీజీ తీసి గుండెపోటుగా నిర్ధారించి రక్తనాళాల్లో బ్లాక్‌లు కరిగించే ఖరీదైన ఇంజక్షన్ చేసి ప్రాణాలను నిలబెట్టారు.. ఇదే పరిస్థితి ఆస్పత్రిలోని సర్జన్ కూడా కలిగింది. విధుల్లో ఉన్న ఆయనకు గుండెపోటు రావడంతో ఆయనకు ఇంజక్షన్ చేసి ప్రాణం పోశారు...

మరో కేసులో ఓ రోగి కడుపునొప్పితో ఆస్పత్రికి వచ్చాడు, పరీక్షించి 24 గంటల నొప్పిగా నిర్ధారించారు. వెంటనే శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టారు. ఇటీవల కాలంలో ఇలాంటి వైద్యాలు ఎన్నో చేసి ప్రజల ప్రాణాలు కాపాడారు. రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో మంచి వైద్యం దొరుకుతుందన్న నమ్మకాన్ని పెంచారు.. గతంలో నరసాపురం ఆసుపత్రి జిల్లాలో ఉత్తమ ఆస్పత్రిగా ఎన్నికై అవార్డును పొందింది.

నరసాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గతంలో నరసాపురం ఆస్పత్రిలో 50 పడకలు మాత్రమే ఉండేవి. యాక్సిడెంట్, డెలివరీలకు సంబంధించి క్రిటికల్ కేసుల్ని ఏలూరు పంపించేవారు. కేవలం నలుగురు వైద్యులు మాత్రమే ఉండేవారు. అయితే నేడు పరిస్థితి మారింది. ఆస్పత్రి స్థాయి 50 నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ అయింది. నలుగురు నుంచి డాక్టర్ల సంఖ్య 19కి పెరిగింది. ఒక రేడియా లజిస్టు, గుండె వైద్యులు, ఎముకలకు సంబంధించి ఆపరేషన్లు మినహా అన్ని శస్త్ర చికిత్సలు ఇక్కడ జరుగుతున్నాయి. ఇద్దరు మత్తు డాక్టర్లు, ఒక చిన్న పిల్లల డాక్టర్, చర్మవ్యాధి, ఈఎన్‌టీ, కంటికి సంబంధించి డాక్టర్లు ఉన్నారు. రోజుకు 300 నుంచి 500 మంది రోగులు ఈ ఆస్పత్రికి వస్తు న్నారు. నెలకు 400లకు పైగా మేజర్, మైనర్ సర్జరీలు చేస్తున్నారు. అందులో 80కి పైగా డెలవరీ సర్జరీలే ఉంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో డెలివరీకి సిజేరియన్ చేయాలంటే రూ.30 నుంచి రూ.50 వేలు అవుతుంది. అయితే డెలివరీకి ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క రూపాయి ఖర్చు అవ్వడం లేదు.

అత్యాధునికమైన పరికరాలు

ఇక కంటికి సంబంధించి శుక్ల ఆపరేషన్లు, గొంతు, చెవికి సంబంధించి మైనర్ అపరేషన్లు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నారు. వీటికి సంబంధించి పరికరాలు, థియేటర్లు కూడా ఉన్నాయి. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్లు చేసేందుకు ప్రత్యేకంగా మూడు థియేటర్లు ఉన్నాయి. ఒకే సమయంలో రెండు సర్జరీలు చేసే పెద్ద థియేటర్ జిల్లాలో ఈ ఆస్పత్రిలోనే ఉంది. ఇక రక్త పరీక్షలకు సంబంధించి రూ.30 లక్షల విలువైన అత్యాధునికమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. హార్మోన్స్ పరీక్షలు మినహా ప్లేట్‌లైట్స్, కిడ్నీ, లివర్, రక్తం శాతం, పోటాషియం, సోడియం లెవల్స్‌కు సంబం ధించిన పరీక్షలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. పాము, కుక్క కాటులకు వ్యాక్సిన్ నిరంతరం అందుబాటులో ఉంటుంది.

ఆస్పత్రిలోనే బ్లడ్ బ్యాంకు

రోగుల ప్రాణాలు నిలబెట్టే బ్లడ్ బ్యాంకు కూడా ఈ ఆస్పత్రిలోనే ఉంది. దీని వల్ల అత్యవసరమైన కేసులకు త్వరితగతిన రక్తం అందించే వీలుం టుంది. ఇక జిల్లాలో ఏ ఆస్పత్రికి లేని విధంగా 13 ఏసీ స్పెషల్ రూమ్‌లు ఉన్నాయి. వీటిని నామమాత్రపు అద్దెతో రోగులకు ఇస్తున్నారు. ఇక రెండు ఏసీ జనరల్ వార్డులు కూడా ఉన్నాయి. ప్రసూతి మహిళలకు కేటాయిస్తున్నారు.

ముగ్గురు వైద్యుల కొరత

అయితే ఈ ఆస్పత్రిలో ఇంకా ముగ్గరు వైద్యుల కొరత ఉంది. సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, రేడియాలజిస్టులు లేరు... వీరితో పాటు శానిటేషన్ సిబ్బంది కూడా తక్కువే. ఆస్పత్రి స్థాయి పెరిగినా దానికి అనుగుణంగా శానిటరీ సిబ్బందిని పెంచలేదు. ఇక ఆర్థోసర్జన్ ఉన్నప్పటికీ సర్జరీలు చేసేందుకు ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో పరికరాలు లేవు. ఈ కారణంగా సర్జరీలు ముందుకు సాగడం లేదు. ఏదైనా యాక్సిడెండ్ కేసు వస్తే ఏలూరు లేదా భీమవరం పంపిస్తున్నారు. స్కానింగ్ మిషన్లు ఉన్నా రేడియాలజిస్టులు లేకపోవడంతో అవి వృథాగా మిగిలాయి. గర్భిణులకు స్కానింగ్ చేయాలంటే బయటకు వెళ్లాల్సిందే.

త్వరలో డయాలసిస్ సెంటర్



ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గతం కంటే బాగా పెరిగింది. దానికి కారణం పూర్తిస్థాయిలో వైద్యులు ఉండటం, మెరుగైన వైద్య సేవలు అందించడమే. ఇంకా ముగ్గురు వైద్యుల కొరత ఉంది. వాటిని భర్తీ చేస్తే అత్యవసర కేసుల్ని కూడా ఇక్కడే చూడవచ్చు. త్వరలో ఆస్పత్రికి డయా లసిస్ సెంటర్ రాబోతున్నది. ఇది వస్తే కిడ్నీ రోగులకు ఇబ్బందులు ఉండవు.

-డాక్టర్ సుప్రియ, సూపరింటెండెంట్



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగులు



ఆధునిక ఎక్స్‌రే ల్యాబ్

కృషి పండిట్ నెక్కంటికి రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం

ఆచంట, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): ఆచంటకు చెందిన కృషి పండిట్ నెక్కంటి సుబ్బారా వుకు ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందింది. కృషి పండిట్‌గా పిల వబడే నెక్కంటికి 89 సంవత్సరాలు వయసు... గత అరవై ఏళ్లుగా వ్యవసాయం చేస్తూ రైతులకు తాను పండించిన కొత్త వరి వంగడాలను అందిస్తు న్నారు. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక , తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో అనేక మంది రైతులకు సుబ్బారావు కొత్త సీడ్ ఇచ్చి రైతులను పోత్సహిస్తున్నారు. 1967లో అప్పట్లో కేంద్ర మంత్రి టి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హరిత విప్లవం ఆచంట నుంచి మొదలైంది. మొదట్లో ఐఆర్ 8 పొట్టి వరి వంగ డాన్ని ఆచంటలో అభివృద్ధి చేసి దానిని అనేక దేశాలకు అందించ డంలో సుబ్బారావు పాత్ర ఎంతో కీలకం. ప్రస్తుతం కొత్తగా అత్యంత సన్న రకం ఆర్‌జీఎల్ 7034, 7039 వరి వంగడాలను సాగు చేస్తు న్నట్లు సుబ్బారావు తెలిపారు. కొత్త వరి వంగడాలను పంపి రైతులను ప్రోత్సహిస్తున్నందుకు ఇప్పటి వరకు సుబ్బారావు 16 నేషనల్, 3 ఇంటర్నేషనల్ అవార్డులు అందుకున్నారు. రిపబ్లిక్ వేడుకలకు రాష్ట్రపతి ద్వారా ఆహ్వానం అందడం పట్ల సుబ్బారావును పలువురు అభి నందించారు.



రాష్ట్రపతి పంపిన ఆహ్వానంతో రైతు నెక్కంటి సుబ్బారావు

మ్యాజిక్ స్టార్ బోస్ మరో రికార్డు

భీమవరం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మేజిక్ స్టార్ డాక్టర్ బోస్ నాలుగు సంవత్సరాల క్రితం చేసిన రచన 'నా ప్రస్థానం'ను అరుదైన గ్రంథంగా గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ బోస్‌కు 'ఐబీఆర్ అచీవర్' అవార్డును ప్రదానం చేసింది. మేజిక్ రంగంలో మెజీషియన్‌గా, రచయితగా 50 సంవత్సరాల తన అనుభవాలతో బోస్ చేసిన స్వీయచరిత్ర 'నా ప్రస్థానం' అని ఆ సంస్థ తన సర్టిఫికెట్‌లో పేర్కొంది. బోస్ తన ఆత్మకథా పుస్తకంలో మేజిక్ రంగం తనను ఆకర్షించిన విధానం, తాను అందులో ప్రవేశించడానికి చేసిన ప్రయత్నాలు, మేజిక్ నేర్చుకున్న విధానం,నెలకొల్పిన మేజిక్ సంస్థల వివరాలు, మేజిక్ రచయితగా మారిన విధానం, మేజిక్ గ్రంథాల రచనలు, అవార్డులు, సన్మానాలు, రికార్డులు, ఇలా తన చరిత్రను పలు అధ్యాయాలుగా వివరించారు. సోమవారం భీమవరం పర్యటనకు వచ్చిన లోకేశ్‌కు ఆయన ఈ పుస్తకాన్ని అందజేశారు.



బోస్ రచించిన 'నా ప్రస్థానం'ను మంత్రి నారా లోకేశ్‌కు అందిస్తున్న దృశ్యం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు

ద్వారకాతిరుమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంకన్న హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 40 రోజులకు రూ.3.85 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో మంగళ వారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. 3,85,61,549 రూపాయల నగదుతో పాటు 383 గ్రాముల బంగారం, 12.008 కేజీల వెండి లభించినట్లు ఈవో వివ రించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (23), 1000(4) 2000(7)తో పాటు విదేశీ కరెన్సీ సైతం లభించింది.



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది



కోమటికుంటలో శ్రీమాతంగమ్మ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

మేకా శేషుబాబు రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

కేసు నమోదు

గోపాలపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో కోమటికుంట రెవెన్యూ పరిధిలో శ్రీమాతంగమ్మతల్లి ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం గుట్టు రట్టయ్యింది. పాలకొల్లుకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, కోమటి గుంట గ్రామానికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి భాగస్వామ్యంతో కొనసాగుతున్న ఈ మిల్లులో అధికారులు రెండు రోజుల పాటు తనిఖీలు చేశారు. మంగళవారం రెవెన్యూ అధికారులు సుమారు 5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసు కున్నారు. ఈ రైస్‌మిల్లులో శేషుబాబు కుటుంబంలో నలుగురికి 80 శాతం వాటాలు, మిగిలిన 20 శాతం శ్రీరామమూర్తి భాగస్వా మ్యంతో ఫర్మ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఇటీవల భాగ స్వాముల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ మిల్లు నిర్వహణపై ఎప్పటి నుంచో ఎన్నో ఆరోపణలు ఉండడంతో గతంలో తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే అప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో విషయం బయ టకు పొక్కలేదు. ఇదిలా ఉండగా రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉంచి నట్టు, ఏలూరు జిల్లా జంగా రెడ్డిగూడెం విష్ణుప్రియ మిల్లు పేరుతో మరొక లోడు ఉన్న విషయం బయటకు పొక్కింది.ఈ మేరకు సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్, పోలీస్, రెవెన్యూ అధికారులు మిల్లును చుట్టుముట్టి సోమవారం సాయంత్రం నుంచి మంగళ వారం మధ్యాహ్నం వరకు తని ఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ సంచుల్లో 2,133 కేజీల పీడీఎస్ బియ్యంతో పాటు మరో లారీలో రీసైక్లింగ్ చేసి గోనె సంచుల్లో ఉన్న 580 బస్తాలకు సంబంధించి 3.01 టన్నుల బియ్యం మొత్తం 5,233 కేజీలు సీజ్ చేసినట్టు తహ సీల్దార్ కె.అజయ్‌బాబు, సీఎస్ డీటీ దివాకర్ తెలిపారు. యజమానులు మేకా శేషుబాబు, శ్రీరామ్మూర్తిపై 6ఏ కేసు నమోదు చేశారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యం

గ్రామాల్లో జలశక్తి అభియాన్ కేంద్ర బృంద సభ్యుల పర్యటన

ఆచంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి):సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర జలశక్తి అభియన్ చీఫ్ నోడల్ అధికారి జితేంద్రసింగ్ అధికారులను ఆదేశించారు. జలశక్తి అభియాన్ జేపీసీ కేంద్ర బృంద సభ్యులైన జితేంద్రసింగ్, మౌనిక సింగ్, డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు మంగళవారం ఆచంట మండలం భీమలాపురం, నరసాపురం మండలం సీతారాంపురం, పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామాల్లో పర్యటించారు. భీమలాపురంలో ఉపాధి హామీ పథకంలో రైతులు పండిస్తున్న తైవాన్ జామ పంటను, గ్రామంలో తాగు నీటి సరఫరాను పరిశీలించారు. మొక్కలు నాటారు. భీమలాపురం నుంచి లంకగ్రామానికి పడవపై వెళ్లారు కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, ఎంపీడీవో పూర్ణ బాబ్జి, ఏపీవో సుదర్శన్, సీవో పోసి పాల్గొన్నారు. సీతారాంపురంలో మామిడి తోటలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం క్రింద రైతులు సాగు చేసిన పంటలను, గ్రామంలో తాగునీటిని పరిశీలించారు. సర్పంచ్ వెంకట్, ఎంపీడీవో రామకృష్ణంరాజు, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, గణపతిరాజు పాల్గొన్నారు. పొలమూరులో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో సందర్శించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనుల పురోగతి బాగుందని, అధికారులు టీం వర్కుతో పని చేస్తున్నారని అభినందించారు. ఉపాధి కూలీల రేటు పెంచాలని కూలీలు విన్నవించారు.


భీమలాపురంలో మొక్క నాటుతున్న కేంద్ర జలశక్తి అభియాన్ సభ్యులు


అవార్డు అందుకున్న ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అరుదైన పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ) అవార్డుల ప్రదానోత్సవంలో హైదరాబాద్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రమణారావు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. సివిల్ ఇంజరింగ్‌లో విశిష్ట సేవలందించినందుకు ఈ అవార్డు వరించింది. ఆయనను నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి, డాక్టర్ వి.సందీప్ డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ హిమబిందు అభినందనలు తెలిపారు.

టీచర్ల బదిలీలు మాన్యువల్‌గానే నిర్వహించాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : టీచర్లకు త్వరలో చేపట్టనున్న సాధారణ బదిలీల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల స్థానాలకు అభీష్టాన్ని నమోదు చేయడం బదులుగా మాన్యువల్ విధానంలో పాఠశాలలను ప్రత్యక్షంగా ఎంచుకునే సౌకర్యా న్ని కల్పించాలని ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహన్‌రావు డిమా ండ్ చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మాన్యు వల్ కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల్లో రాజకీయ ప్రమేయం లేకుండా చేసిందని వివరించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ వల్ల తప్పనిసరి బదిలీ ఉపాధ్యాయులు జిల్లాలోవున్న అన్ని వేకెన్సీలకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుందని, దీనివల్ల ప్రాధాన్యతాక్రమాన్ని సరిగా పాటిం చక పోవడంతో ఉద్యోగులైన భార్యాభర్తలు దూరప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుందన్నారు.

సోలార్ వెలుగులు

ఇప్పటికే రోజువారీ విద్యుత్ అవసరాలు తార స్థాయికి పెరగడం, ఆ మేరకు వ్యయ భారం పెరుగుతున్న తరుణంలో తక్కువ ఖర్చుతోనే సౌర విద్యుత్ వినియోగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నది. ద్వారకా తిరుమలలో సోలార్ పార్కును ప్రయోగాత్మకంగా ప్రతిపాధించారు. మరో నాలుగు గ్రామాల్లో ఇలాంటి ప్లాంట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇకముందు వీలైనంత మేర గృహ వినియోగంతో పాటు ఎస్సీ, ఎస్టీ కాలనీలకు సౌర విద్యుత్‌ను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

- ద్వారకాతిరుమలలో సోలార్ పార్కు ఏర్పాటు దిశగా ప్రతిపాదన
- మూడు ఎకరాల్లో ఏర్పాటుకు పరిశీలన
- తొలుత ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గృహ అవసరాలకు ప్రాధాన్యం
- సూర్యఘర్ పథకం ప్రోత్సాహకానికి బ్యాంకర్ల రుణాలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకప్పుడు ఉన్న వినియోగానికి, ప్రస్తుత విద్యుత్ వినియోగానికి సంబంధమే లేకుండా పోయింది. ఇది విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ప్రభావం పడింది. 2014 వరకు ఎడాపెడా విద్యుత్ కోతలే ఉండేవి. పల్లె ప్రాంతాల్లో 16 గంటలపాటు, పట్టణాల్లో రోజుకు రెండు విడతలు చొప్పున ఎనిమిది గంటలు కోత విధించేవారు. ప్రభుత్వం అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేయాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని 2014 తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం కొంత అధిగమించింది. రోజువారీ వ్యవసాయ అవసరాలకు సరిపడా తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరాకు ఊతమిచ్చింది. అదే వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు కోతలతో పాటు విద్యుత్ సరఫరాలో ఎగుడుదిగుడులను సవరించలేక పోయారు. మూడు గదుల సాధారణ గృహంలో ఇంతకు ముందు ప్రతి నెలా విద్యుత్ బిల్లు రూ.250 నుంచి రూ.300 లోపు వచ్చేది. ఇప్పుడది కాస్తా రూ.700 నుంచి రూ.900లకు పెరిగింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా, డిమాండ్ మధ్య వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనపడింది. దీనికితోడు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ నిమిత్తం విద్యుత్ వినియోగించుకోవడం, ఆ తర్వాత రూ.కోట్లలో ఈపీడీసీఎల్‌కు బకాయి పడడం సర్వ సాధారణమైంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్వహణకు ఇప్పటివరకు వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి రూ.250 కోట్ల పైగానే బకాయి ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

ఐదు ప్రాంతాల్లో సోలార్ పార్కులు

పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకముందు సౌర విద్యుత్‌ను భారీగా వినియోగించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగానే జిల్లా పరిధిలోని ద్వారకాతిరుమలలో సోలార్ పార్కును ప్రతిపాధించారు. సుమారు 750 కిలోవాట్స్ సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ పార్కు ఏర్పాటు దిశగా ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలో 560 ప్యానల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. రూ.మూడు కోట్ల ఖర్చుతో ప్రతిపాదిత సోలార్ పార్కును త్వరితగతిన అమలులోకి తెచ్చేందుకు వేగంగా ముందుకు కదులుతున్నారు. ద్వారకాతిరుమలలో ప్రభుత్వ ఆధీనంలోని మూడు ఎకరాల భూమిని జిల్లా అధికారులు పరిశీలించారు. దీనికితోడు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీ తేజ్ ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను సమీపంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు, గృహ అవసరాలకు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ అవసరాలకు వినియోగించుకో వాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఇక్కడ ఏర్పాటు చేసే సోలార్ పార్కు ఇతర ప్రాంతాలకు మోడల్‌గా ఉండాలని నిర్దే శం చేశారు. అలాగే జిల్లా పరిధిలో కామవరపుకోట మండలం తడికలపూడి, నిడమర్రు మం డలం చిననిండ్రకొలను, పెదవేగి మండలం దుగ్గిరాల, కొయ్యలగూడెం మండలం ఎర్రం పేటల్లో ద్వారకాతిరుమల తరహాలోనే సౌర విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రతిపాదించారు. ద్వారకాతిరుమలలో సోలార్ పార్కుకు సంబంధించి పూర్తి నిర్వ హణ బాధ్యత ఈపీడీసీఎల్‌కు అప్పగించారు.

సూర్యఘర్‌కు ప్రోత్సాహం

కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచే దిశగా ఇప్పటికే సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఎవరైతే సౌర విద్యుత్‌ను వినియోగించ దలచుకున్నారో వారందరికీ కిలోవాట్‌కి సబ్సిడీ ఇచ్చే దిశగా ప్రణాళిక ప్రకటించింది. ఈ మేరకు బ్యాంకర్లు సౌర విద్యుత్ వినియోగ దారులను ప్రోత్సహించే దిశగా దరఖాస్తు చేసిన వెంటనే సబ్సిడీతో నెలవారీ చెల్లింపు జరిగేలా రుణకల్పన చేయాల్సిందిగా సూచించింది. మేడపైన ప్రతి 100 చదరపు అడుగుల ప్రాంతంలో ఒక రూఫ్ సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అనువైన ప్రోత్సాహాన్ని ప్రకటించింది. భవిష్యత్‌లో సౌర విద్యుత్ వినియోగం మరింత పెరిగేలా సూర్యఘర్ పథకంలో కేంద్రం దిశా, నిర్దేశం చేసింది. జిల్లా వ్యాప్తంగా సూర్యఘర్ పథకం కింద ఇప్పటికే వివిధ బ్యాంకుల్లో దరఖాస్తులు అందుతున్నట్టు సమాచారం.

270 మంది అభ్యర్థుల అర్హత

కానిస్టేబుల్ అభ్యర్థులకు కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థుల ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్, అభ్యర్థులకు పరుగు పందెం

ఏలూరు క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మంగళవారం 600 మంది అభ్యర్థులు హాజరు కావాలని హాల్‌టిక్కెట్లు జారీ చేశారు. వీరిలో 419 మంది హాజరు కాగా వారికి 1600 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, పలు ఈవెంట్స్‌ను నిర్వహించారు. వీరిలో 270 మంది అర్హత సాధించారు. జిలా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, పోలీసు అధికారులు ఈ దేహదారుఢ్య పరీక్షలు అభ్యర్థులకు నిర్వహించారు. అభ్యర్థులకు ఇచ్చిన తేదీలో హాజరు కాలేక అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 9వ తేదీన హాజరు కావాలని ఎస్పీ సూచించారు.

మార్కులు తక్కువ వచ్చాయని ఇంటి నుంచి విద్యార్థుల పరార్

ఏలూరు బస్టాండ్‌లో అధికారుల గుర్తింపు.. తల్లిండ్రులకు అప్పగింత

ఏలూరు క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం యర్నగూడెం మండలానికి చెందిన మూసాల లక్ష్మీనరసింహరాజు (13), తెలగారెడ్డి నవదీప్(13) యర్నగూడెం హైస్కూలులో 7వ తరగతి చదువుతున్నారు. మంగళవారం స్కూల్‌లో ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చారు. మార్కులు తక్కువ రావడంతో తల్లిదండ్రులు సంతకాలు పెట్టరనే భయంతో స్కూలు నుంచి ఏలూరు కొత్త బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్టాండులో అనుమానాస్పదంగా ఉండడంతో గస్తీ నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ వైకిరణ్ వెంటనే ఈ విషయాన్ని ఆర్టీసీ పీఆర్వో కేఎల్‌వీ నరసింహం దృష్టికి తీసుకువెళ్ళారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ఆ ఇద్దరు విద్యార్థులను బస్టాండ్‌లోనే సంరక్షణ చేశారు. ఆ విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు ఎనిమిది గంటలకు చేరుకున్నారు. దీంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థులను అప్పగించారు.

ఎకో సెన్సిటివ్ జోన్‌పై నేడు సమావేశం

ఆకివీడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి):కొల్లేరు అభయారణ్యం చుట్టుపక్కల ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించే అంశంపై ప్రజాభిప్రాయం సమావేశం బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం జరుగుతుందని తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చునని తెలిపారు.

నేడు దూబచర్ల 'డైట్'లో ఉమ్మడి జిల్లా రంగోత్సవ్

ఏలూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రంగోత్సవ్-2025 ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి పోటీలను ఈనెల 8న దూబచర్లలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ఉదయం 10 గంటలనుంచి నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ, డైట్ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి తెలిపారు. ఉమ్మడి జిల్లాపరిదిలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని వివరించారు. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై క్విజ్, స్వాతంత్ర్య సమరయోదుల చిత్రాలపై డ్రాయింగ్, తెలుగు/ఇంగ్లీషులో హేండ్‌రైటింగ్, ప్రతీ స్కూలు నుంచి ఐదుగురు విద్యార్థుల బృందంతో రంగోలి గ్రూప్ ఈవెంట్, ఏపీ, పంజాబ్ జానపదనృత్యాలు, యూనిటీ, ఇంటిగ్రిటీపై డిజిటల్ కాలేజ్, ఏక్‌భారత్ శ్రేష్టభారత్ అంశంపై స్లోగన్ రైటింగ్, భారతీయ సంస్కృతి, చరిత్ర, విలువలు అంశంపై రోల్‌ప్లే పోటీలు జరుగుతాయన్నారు. సంబందిత పోటీలకు ఒక్కో పాఠశాలనుంచి ఒక విద్యార్థిని మాత్రమే (రంగోలి మినహా) అనుమతిస్తారని, ఆసక్తిగల విద్యార్థులు డైట్ సీనియర్ లెక్చరర్ పి.వి.రమణమూర్తిని ఫోన్ నెంబరు 99518 17359లో సంప్రదించి ముందుగా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

స్కౌట్స్ టీచర్లకు కెప్టెన్ శిక్షణ తరగతులు



ఏలూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం శ్రీ పథకానికి ఎంపికైన హైస్కూళ్ళలో పనిచేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్లకు కెప్టెన్ శిక్షణ తరగతులు ఏలూరు హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగుతాయి. జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ సౌట్స్ శిక్షణలో ప్రతిభకనబరిచిన విద్యార్థులు రాజ్య పురస్కార్ అవార్డులను గవర్నర్‌నుంచి, రాష్ట్రపతి పురస్కార్ అవార్డులను దేశప్రథమ పౌరునినుంచి పొందవచ్చునని, ఈ పురస్కారాల గ్రహీతలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని వివరించారు. ఇకమీదట స్కౌట్స్ విద్యార్థులకు యూనిఫాం పీఎం శ్రీ నిధులతోనే సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులోబాగంగా పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలకు రూ.5 కోట్ల నిదులతో రూ.2 కోట్ల విలువైన వివిధ రకాల పరికరాలు అందజేయడం, స్కూలు క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధిచేయడం వంటివి చేపడతారని వివరించారు. శిక్షణలో భాగంగా ప్రథమచికిత్స, టెంట్ కట్టుకునే విదానం, తదితర అంశాల్లో మెళకువలు నేర్పించారు. స్కౌట్స్ కార్యదర్శి భాస్కరకుమార్, వివిధ కేడర్ల అధికారులు ప్రసాద్, ధనలక్ష్మి, పద్మ, సౌజన్య, శ్రీదేవి, చాంద్‌బీబీ తదితరులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

క్రైమ్ కార్నర్

ఆరున్నర కేజీల వెండి అపహరణ
సేల్స్‌మేన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఏలూరు క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి):ఒక జ్యూవెలరీ షోరూమ్‌లో పనిచేస్తున్న సేల్స్‌మేన్ దఫదఫాలుగా ఆరు కేజీల 400 గ్రాముల వెండి పట్టీలను అపహ రించినట్లు మేనేజర్ గుర్తించి ఏలూరు త్రిటౌన్ పోలీసులో ఫిర్యాదు చేశారు. దీంతో సేల్స్‌మేన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు తూర్పు వీధినకు చెందిన తెంటు సత్యనారాయణ ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద ఉన్న సీఎంఆర్ జ్యూవెలరీ షాపులో వెండి విభాగంలో పనిచేస్తున్నాడు. ఆరు నెలలకు ఒక్కసారి వెండి వస్తువుల స్టాకును లెక్కిస్తూ ఉంటారు. ఇటీవల స్టాక్‌ను లెక్కించడంతో ఆరు కేజీల 400 గ్రాములు వెండి వస్తువులు లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో తెంటు సత్యనారాయణపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో షాపింగ్‌మాల్ మేనేజర్ అంజూరి దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేయడంతో త్రిటౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రైలుపట్టాలు దాటుతున్న వృద్ధుడిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు పెన్షన్ లైన్‌కు చెందిన మహ్మద్ నసీమ్ (60) మంగళవారం ఉదయం గన్‌బజార్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహనికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఉద్యోగాలిప్పిస్తానని మోసం.. ఒకరి అరెస్టు

ఏలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగా లిప్పిస్తానని మోసం చేసిన కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. పోలవరం గ్రామానికి చెందిన గారపాటి గిరి అనే వ్యక్తి వద్ద ఉద్యోగం ఇప్పి స్తానని విశాఖ జిల్లా కొండపల్లి గ్రామానికి చెందిన వెనిగళ్ళ శ్రీనివాసరావు, విజయవాడకు చెందిన బత్తుల మురళి కృష్ణారెడ్డి 30 లక్షల రూపాయలు కాజేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో వెనిగళ్ళ శ్రీనివాసరావు అనే వ్యక్తిని అల్లూరి సీతారామరాజు జిల్లా పోశమ్మ గండి వద్ద అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు మురళీ కృష్ణారెడ్డి గురించి గాలింపు చేపట్టినట్లు తెలిపారు.

ఆసుపత్రికి వెళితే.. ఇంటిలో దొంగలు పడ్డారు
బంగారు వస్తువుల అపహరణ

ఏలూరు క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి):ఒకవైపు భర్త రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగి చికిత్స పొందుతున్నారు. మరోవైపు అత్తగారు గుండె ఆపరేషన్ జరిగి మరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఆందోళనలో ఆసుపత్రులకు తిరుగుతున్న ఆ ఆ ఇంటిపై దొంగలు కన్నేశారు. ఇంటి తాళాలు పగులగొట్టి 12 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న ఒక మహిళకు రెండు రోజుల క్రితం భర్త రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని ఒక ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేశారు. 6వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసుకుని వెళ్ళి 7వ తేదీ ఉదయం వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో బీరువాలోని 12 కాసుల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనం జరిగిన సంఘటన భర్తకు, అత్తకు తెలిస్తే ఏమవుతుందోనని ఆందోళనకు గురైంది. ఆ ఇంటి ఎదురుగా ఉన్న మరో ఇంటిని తాళాలు పగులగొట్టి చోరీకి యత్నం చేశారు.

యువతి ఆత్మహత్య.. నిందితుడి అరెస్టు

నరసాపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో యువతి ఆత్మహత్య కేసులో నిందితుడు గీతా చరణ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకట సురేష్ చెప్పారు. మూడు రోజుల క్రితం గ్రామంలోని ప్రగతినగర్‌లో లక్ష్మికుమారి (19) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి గీతా చరణ్ వేధింపులే కారణమంటూ బాధితురాలు తండ్రి సింహాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రెండు బృందాలుగా వీడి మండలంలోని పితాని మేరక ప్రాంతంలో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చిన్నట్లు ఎస్ఐ చెప్పారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అప్రమత్తం

- వైద్య, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసిన జిల్లా వైద్యశాఖ అధికారులు
- ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ప్రారంభం
- గ్రామాల్లో పీహెచ్‌సీల వారీగా అనుమానిత లక్షణాలపై పరిశీలన

ఏలూరు అర్బన్/భీమవరం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)ను ముందస్తుగానే నియంత్రించే చర్యలపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది. హెచ్‌ఎంపీవీ జాడలు ఇప్పటి వరకు రాష్ట్రంలో లేనప్పటికీ, పలు రాష్ట్రాల్లో ప్రజలను కలవరానికి గురిచేస్తోన్న ఈ వైరస్‌ను ఆదిలోనే కట్టడిచేసే చర్యలకు ఉపక్రమించింది. మంగళవారం జిల్లాలవారీగా డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, వైద్యవిద్య డైరెక్టరేట్ విభాగాల జిల్లాల హెచ్‌వోడీలతో సంబంధిత రాష్ట్ర అధికారులు వేర్వేరుగా జూమ్ మీటింగ్‌లు నిర్వహించి మార్గదర్శకాల జారీ చేశారు. ఏలూరు జిల్లాలో పలు క్షేత్రస్థాయి ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసారు. ఆ ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటికే నిర్వహిస్తోన్న ఇంటింటా క్యాన్సర్, బీపీ, సుగర్ ప్రాథమిక నిర్ధారణ సర్వే సిబ్బందికే హెచ్‌ఎంపీవీ లక్షణాలు గల రోగుల గురించి సమాచారాన్ని సేకరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, అంటువ్యాధుల విభాగం (ఎన్‌సీడీ) నోడల్ అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు కార్యనిర్దేశం చేశారు. వైద్యప్రామాణికాలప్రకారం ప్రతీ వందమందిలో సాధారణంగా శీతాకాలం సీజన్‌లో ఇద్దరు నుంచి నలుగురు వరకు జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి తదితర రుగ్మతలతో బాధపడుతుంటారు. దీనికి మించి ఒకే పీహెచ్‌సీకి రోజులో ఎక్కువమంది సంబంధిత రుగ్మతలతోవస్తే వెంటనే తెలియ జేయాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఇటువంటి రోగులవివరాలను ఇంటిగ్రేటెడ్ డిసీజెస్ ప్లాట్‌ఫాం (ఐహెచ్‌ఐడి) యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ సర్వే నిమిత్తం వినియోగిస్తున్న 605 వైద్య బృందాలకు అదనపు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ప్రారంభం

ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌ఎంపీవీ బాధితులకోసం ప్రత్యేక వార్డుని మంగళవారం ప్రారంభించారు. వైద్యవిద్య డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం ఆదేశాలతో ఆస్పత్రిలో మొత్తం 20 పడకలతో వార్డును ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు తెలిపారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కునే సంసిద్ధత చర్యల్లో భాగంగా ఎనీటైం ప్రాతిపదికన 10 పడకలతో పాటు, ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యాలతో 8 పడకలను, ఐసోలేషన్ కోసం మరో 2 పడకలను ప్రత్యేక వార్డులో సిద్ధంగా ఉంచారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌నుంచి రిబావలిన్ సిరప్, మందులను నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. అనుమానిత లక్షణాలుగల వారికి వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన కిట్లను కొద్దిరోజుల్లో ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేయనుంది. జలుబు, దగ్గు, గొంతునొప్పి, తదితర శ్వాస సంబంధిత రుగ్మతలు 40 నుంచి 60 శాతం వరకు ఇతరుల నుంచి నోటి తుంపర్ల ద్వారానే సోకుతాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులకు వ్యాపించే అవకాశాలుంటాయి. అంటువ్యాధుల నుంచి దూరంగా ఉండటానికి మాస్కులను తప్పనిసరిగా ధరించాలని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్ రాజు సూచించారు.

హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు కానీ, కేసులు కానీ మన జిల్లాలో లేవని ముందు జాగ్రత్తగా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాను నాయక్ తెలిపారు. ఏమైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్నా పీహెచ్‌సిలోని వైద్యులను సప్రందించాలని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు.. రెండు షాపులు సీజ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తూ స్టాకులో వ్యత్యాసం ఉండడంతో తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి మంగళవారం రెండు షాపులను సీజ్ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీరామ్ బాబుకు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామ కృష్ణ, విజిలెన్సు ఏవో మీరయ్య, మండల ఇన్‌చార్జి వ్యవసాయ శాఖాధికారి పార్థసారధి, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. లక్ష్మీగణపతి ఫెర్టిలైజర్స్ అండ్ ఫెర్టిసైడ్ షాపులో యూరియా అధిక ధరలకు విక్రయి స్తున్న ట్లుగా గుర్తించారు. ఒక లక్షా 80 వేల 305 రూపాయల విలువ కల్గిన 12.150 మెట్రిక్ టన్నుల



ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం కూడా గుర్తించి స్టాక్‌ను సీజ్ చేశారు. సత్యభవానీ ట్రేడర్స్‌లో ఒక లక్షా 44 వేల 375 రూపాయల విలువ కల్గిన 5.250 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈ రెండు షాపులపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 సెక్షన్ 6(ఎ) నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు.

లోకేశ్‌ని కలిసిన ఆచంట బాలుడు

ఆచంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భీమవరంలో సోమవారం జరిగిన పర్యటనలో మంత్రి లోకేశ్ ఆచంటకు చెందిన చిలుకూరి భరత్ అనే బాలుడిని ఆప్యాయంగా హత్తుకున్నారు. ఈ బాలుడు సీఎం చంద్రబాబుకు వీర అభిమాని. ఇటీవల చంద్రబాబు నాయుడు అరెస్టు అయినప్పుడు ఈ బాలుడు ఆచంటలో దీక్ష చేయడంతో పాటు ఆచంటేశ్వరుని సన్నిధిలో గుంజీలు కూడా తీసి మొక్కుకున్నాడు. అలాగే ఆచంటకు చెందిన చిలుకూరి విశ్వేశ్వర రావు, సత్యవతి దంపతులు గత కొన్ని సంవత్సరాలుగా ఆవు మజ్జిగతో వ్యవసాయం చేస్తున్న విషయం ఆచంట వాసులు లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. వారు చెప్పిన విషయాలు అన్ని విని దీనికి సంబంధించిన సమాచారాన్ని జీపీఎ



స్‌ఎఫ్ వారికి పార్వార్డ్ చేయాలని లోకేష్ చెప్పినట్టు తెలిపారు.

దివ్యాంగులకు అన్నివిధాలా అండగా ఉంటాం : కలెక్టర్

ఏలూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అన్ని విదాలా అండగా ఉంటామని, అంధుల కోసం బ్రెయిలీ లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ అక్షర ప్రదాత అని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బ్రెయి లీ 216వ జయంతి ఘనంగా నిర్వహించారు. జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రెయిలీ లిపిలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్క రించారు. పలువురు అంధులకు వాకింగ్ స్టిక్స్‌ను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు, సంఘ నాయకులు వీరభద్రరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్ రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమ ప్రతినిధులు వీరభద్రరావు, రాధారాణి, పలువురు అంధ ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ఏలూరు క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై అవగాహన కల్పించుకోవడం వల్ల హక్కులను కాపాడుకోగలుగుతారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు సమీపంలోని వట్లూరు మెయిన్ బైపాస్ దగ్గర ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి పరిస్థితుల్లోనైనా న్యాయసహాయం అవసరం అనుకుంటే 15100ను సంప్రదించవచ్చని సూచించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతివ్యక్తి ఏ వస్తువు కొన్నా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, వస్తువులోపమైన, సేవల్లో లోపమైనా జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ను సంప్రదించవచ్చని సూచించారు. అనంతరం న్యాయవాది కె.సునీత మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, లైబ్రేరియన్ ఉషారాణి పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన ర్యాలీ



ఏలూరులో రెడ్‌క్రాస్ వలంటీర్ల ర్యాలీ

ఏలూరు క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన ర్యాలీని ఏలూరు రెడ్‌క్రాస్ వలంటీర్లు ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా పలు ప్రాంతాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఎంటీవీ వైరస్‌పై భయపడాల్సిన అవసరం లేదని ఈ వైరస్‌పై అవగాహన కల్గి మాస్కులు ధరించడం, చేతులను శుభ్రపర్చుకోవడం వంటివి చేస్తే సరిపోతుందన్నారు. రెడ్‌క్రాస్ సభ్యుడు ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ కలిసి సమష్టిగా జాగ్రత్తలు పాటిస్తే హెచ్‌ఎంటీవీ వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చున్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, టి.రామారావు, డీఆర్ సీహెచ్ నారాయణ, డాక్టర్ జి.స్పందన, పీఆర్వో కేవీ రమణ, రెడ్‌క్రాస్ నర్సింగ్ విద్యార్థినులు, ట్యూటర్లు పలువురు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ఏలూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంటువ్యాధులు అరికట్టడంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తల పాత్ర క్షేత్రస్థాయిలో చాలా కీలకమని, వైద్యసిబ్బంది అందరూ సమన్వయంతో పని చేసి వైద్యశాఖకు మంచిపేరు తీసుకురావాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. ప్రస్తుతం చైనా దేశంలో ప్రబలుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల దేశంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం నగరంలోని అర్బన్ పీహెచ్‌సీలను సందర్శించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఇంటింటికీ సందర్శించే ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. డాక్టర్ గౌతమ్, డాక్టర్ నిఖిత, డాక్టర్ మానస, డాక్టర్ నీలిమ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

25 ఏళ్లపాటు కష్టపడితేనే వైద్య పట్టా

▸▸ సెయింట్ జోసఫ్ దంత వైద్య కాలేజీ స్నాతకోత్సవంలో డాక్టర్ రాధికారెడ్డి


డిగ్రీ పట్టాను స్వీకరిస్తున్న దంతవైద్య విద్యార్థిని

పెదవేగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తపస్సు చేసిన విధంగా 25 ఏళ్ళపాటు కష్టపడితేనే వైద్య పట్టా చేతికి వస్తుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.రాధికారెడ్డి అన్నారు. దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల 18వ స్నాతకోత్సవ వేడుకలు కళాశాల చైర్మన్, విశాఖపట్నం పాలనాధికారి బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించారు. తొలుత బీడీఎస్, ఎండీఎస్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందించారు. అనంతరం దంతవైద్య విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బెస్ట్ అవుట్ గోయింగ్ వైద్య విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, జ్ఞాపికలను అందించారు. దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ సారథ్యంలో జరిగిన స్నాతకోత్సవంలో ప్రత్యేక అతిథిగా తమిళనాడులోని మైలాపూర్ ఆర్చ్ బిషప్ డాక్టర్ జార్జ్ ఆంథోని స్వామి, ఖమ్మం డయాలసిస్ బిషప్ ప్రకాష్ సిగిలి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, ఏలూరు డయాలసిస్ వికార్ జనరల్, ఫాదర్ డాక్టర్ పి.బాల, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటన ఏర్పాట్ల పరిశీలకుడిగా సొంగా రోషన్

చింతలపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో ఈనెల 8న ప్రధాని మోదీ పర్యటిస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్ల పరిశీలకుడిగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను నియమించారు. మంగళవారం శృంగవరపుకోట చేరుకున్న రోషన్‌కుమార్‌కు అక్కడి ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడి అధికారుల సమక్షంలో పర్యటన ఏర్పాట్ల పరిశీలన జరిగినట్టు ఆయన తెలిపారు.

కారు ఢీకొని.. ఎనిమిది గొర్రెల మృతి

ద్వారకాతిరుమల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న గొర్రెలను అతివేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 గొర్రెలు మృతి చెందగా, మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన మండ లంలోని గుణ్ణంపల్లి వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలివి.. భీమడోలు మండలం కొండ్రెడ్డినగర్‌కు చెందిన ఓ వ్యక్తి గొర్రెల మందను సమీప గ్రామమైన గుణ్ణంపల్లి పరిసరప్రాంతాల్లోని పొలాల్లో మేపుకుని స్వగ్రామానికి తోలు కెళ్తున్నాడు. ఘటనాస్థలం వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెలను ఏలూరు నుంచి రాజమండ్రి వైపునకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. గొర్రెలు మృతి చెందగా స్థానికులు ఆ కారును చుట్టు ముట్టారు. కారు ముందుభాగం సైతం దెబ్బతింది. సమాచారం అందుకున్న ద్వారకాతిరుమల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి కృషి

ఏలూరుటూటౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి మంగళవారం వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజా సమస్యల్లో ఎక్కువగా ఆరోగ్య సమస్యలతో వస్తున్నారని వీరందరికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సీహెచ్ వెంకటరత్నం, కిషోర్ పాల్గొన్నారు.

మాలల భవనానికి సహకరిస్తాం..

జన్మభూమి పార్కువద్ద భవన నిర్మాణా నికి చెందిన స్థలాన్ని మంగళవారం మాల సోదరులతో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి తనవంతు సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాలల ఫైనాన్స్ కార్పొ రేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, చాగంటి సంజీవ్, డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, నూకపేయి సుధీర్‌బాబు, పళ్ళెం ప్రసాద్, శామ్యూల్, మాణిక్యాలరావు, జాలా బాలాజీ, గుడిపూడి రవి, చెక్కుల బెనర్జీ, మెండెం ఆనంద్, దాసరి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

పౌరసరఫరా సక్రమ నిర్వహణకు సహకరించండి : జేసీ

ఏలూరురూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లై సక్రమంగా నిర్వహించేందుకు డీలర్లంతా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. జిల్లా డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఏలూరుజిల్లా అధికారులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాక్షలు తెలిపారు. తొలుత జేసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఎస్‌వో సత్యనారాయణరాజు, డీఎం వి.శ్రీలక్ష్మి, ఏఎస్‌వో ప్రతాప్‌రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిలా ముఖ్యకార్యదర్శి అత్తులూరి ఉదయేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొలుసు లక్ష్మణరావు, కోశాధికారి కె.నాగరాజు, జాయింట్ సెక్రెటరీ బి.కోటేశ్వరరావు, గిరి, నూజివీడు ఏసు, మహిళా అధ్యక్షురాలు పిల్లా రాజరాజేశ్వరి, హరికృష్ణ, బాషా తదితరిలు ఉన్నారు.

అటవీ శాఖ అధికారిని కలిసిన అసోసియేషన్ నాయకులు

ఏలూరురూరల్/జీలుగుమిల్లి జన వరి7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీశుభమ్‌ను మంగళవారం అటవీ శాఖ అసోసియేషన్ నాయకులు కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. అధ్యక్షుడు కె.రాంబాబు, జనరల్ సెక్రెటరీ బి.ప్రసాద్, ఉపాధ్యాక్షులు వి ఏసుపండు, జాయింట్ సెక్రెటరీ డి శ్రీను, జి మారేష్, అసోసియోషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై టీచర్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే అత్యుత్తమమైన వ్యవస్థాపక మనస్తత్వాన్ని, 21వ శతాబ్దపు నైపుణ్యాలను బాలబాలికల్లో పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవస్థాపక మనస్తత్వ విద్యను ప్రాధాన్యతాంశంగా తీసుకుందని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ అన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు రాష్ట్రంలో ఎంపిక చేసిన హైస్కూళ్ళలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించే క్రమంలో తొలుత సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఆయన మాట్లాడుతూ సుస్థిర భవిష్యత్తుకోసం యువ విద్యార్థులు ప్రావీణ్యం పొందేందుకు మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సమగ్రశిక్ష ఏఎంవో ఆర్.రామారావు, రాష్ట్ర ప్రోగ్రాం జోనల్ మేనేజర్ సీహెచ్.బ్రహ్మం పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

చింతలపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి యర్రంపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు అప్పిరెడ్డి రాము మాట్లాడుతూ మండల శాఖ డైరీని నూజివీడు డీవైఈవో సేవియా ఆవిష్కరించారని, క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. పీఆర్‌టీయూ నాయకులు చంద్రు రాజేంద్ర, కీమ్యా నాయక్, దయాకర్, ఎన్.ఎస్.రాజేంద్ర, పాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

బుట్టాయగూడెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగులపాడు, రేపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని కొండరెడ్డి పిల్లలకు సీడీపీవో తులసీ మంగళవారం ప్లేట్లు, గ్లాసులు, బ్యాగులు, అందజేశారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన బిడ్డ పుట్టాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. హెచ్‌ఎం సతీష్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, న్యూడెమోక్రసీ నాయకుడు కారం రాఘవ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఏలూరు, హేలాపురి, ప్రైవేట్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయటం లేదన్నారు. ఇప్పటికైనా సంక్షేమ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికశాఖ కార్యాలయం వద్ద దర్నా చేస్తామని హెచ్చరించారు. ఎం.శంకర్‌రావు, కె.సహదేవుడు, కోడి రవి, అన్నమాచార్యులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

ఏలూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్కీమ్ వర్కర్లకు రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం డీఆర్వోకు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ గత పదిహేనేళ్ల నుంచి కేంద్రప్రభుత్వం ఇప్పటిదాకా వేతనాలు పెంచలేదని, పనిభారం పెంచుతూ నిత్యం నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతుందే తప్ప కార్మికుల వేతనాలు పెంచడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు, సైదా, గంధం అంజమ్మ, నెల్సన్ అమ్మ, కరాటం సీతామహాలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

మొదటిరోజు ప్రశాంతంగా పీసా గ్రామసభ ఎన్నికలు

బుట్టాయగూడెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం మండలంలో మొదటి రోజు మంగళవారం జరిగిన పీసా గ్రామసభల ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. అలివేరు, అంకపాకల, రేగులపాడు, అంతర్వేది గూడెం, నాగులగూడెం, గాడిదబోరు, పందిరి మామిడిగూడెం, అచ్చియ్యపాలెం, విప్పలపాడు, రేగులకుంట, సూరవవారిగూడెం, బుట్టాయగూడెం, దొరమామిడి, చినజీడిపూడి, గుబ్బిసమామిడి, కొమరవరం, వేరుమద్దిగూడెం, గురుగుమిల్లి, తెల్లంవారిగూడెం, బెడదనూరు మొత్తం 20 గ్రామాల్లో పీసా గ్రామసభలకు అధికారులు ఎన్నికలు నిర్వహించగా బుట్టాయగూడెం, అచ్చియ్యపాలెం, తెల్లంవారిగూడెం గ్రామాల్లో కోరంలేక ఎన్నిక నిలిచిపోయాయి. దొరమామిడి పీసా గ్రామసభకు ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ముచ్చిక కృష్ణ, కొమరం నాగార్జునరావులకు అధికారి టి.బాబూరావు నియమాకపు పత్రాలను అందజేశారు. సర్పంచ్ తెల్లం రాముడు, కార్యదర్శి జె.కిరణ్‌కుమార్ రెవెన్యూ, సచివాలయం శాఖల సిబ్బంది పాల్గొన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ లత, ఎంపీడీవో కె.జ్యోతి ఎన్నికల నిర్వహణను పలుచోట్ల పరిశీలించారు.

● ఏలూరు : పోలవరం మండలంలో గెడ్డపల్లి, చీమలూరు, గిన్నేపల్లి, దార్వాడ గ్రామాల్లో జరిగిన పీసా కమిటీ ఎన్నికలలో ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంపీడీవో ఈ. శ్రీనివాస్ తెలిపారు.

● కుక్కునూరు : కుక్కునూరు మండలంలో మంగళవారం రెడ్డిగూడెం, అమరవరం, మర్రిపాడు గ్రామాలకు సంబంధించి కార్యదర్శుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. పుల్లప్పగూడెం, ఎల్లప్పగూడెం, చీరవల్లి, గ్రామాల పీసా కమిటీ ఎన్నిక వాయిదాపడింది. హాజరయ్యే సభ్యుల కోరం పూర్తికాకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు సమాచారం.


రైతు సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

లింగపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రైతుల సంక్షేమానికి వారి సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ సజీముల్లాషా, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం లింగపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డీటీ నాగబాబు, సర్పంచ్ హేమలత, తాతిన రాధాకృష్ణ రెవెన్యూ సిబ్బంది, పలువురు కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారుల వెంబడి చెత్త వేయకూడదు

ఉంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రధాన రహదారుల వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన కార్యదర్శుల సమావేశంలో సచివాలయ సిబ్బంది హాజరు తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలను తయారు చేసి గ్రామ సభల ద్వారా ఆమోదింప చేసుకోవాలన్నారు.

దొంగతనంపై కేసు నమోదు

భీమడోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలను గ్రామంలో ఈనెల ఆరో తేదీన ఒక ఇంట్లో దొంగతనం ఘటనపై భీమడోలు పోలీ సులు కేసు నమోదు చేశారు. గ్రామస్థుడు నల్లపురాజు ఆంజనేయరాజు గత నెల 24వ తేదీన ఏలూరు బంధువుల ఇంటికి వెళ్ళాడు. ఈనెల ఆరో తేదీ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపులు, బీరువా పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచా రం ఇవ్వడంతో కేసు నమోదు చేశారు. ఈ దొంగతనంలో రూ. మూడు వేల నగదు తస్కరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవారి ధనుర్మాస ఉత్సవం



ద్వారకా తిరుమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తొళక్క వాహనంపై కొలువు దీరిన స్వామి, అమ్మవార్లు ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని గోదాదేవితో కలిసి మంగళవారం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ఆ తరువాత ధనుర్మాస ఉత్సవం వైభవంగా జరిగింది. మండపంలో కొలువుతీరిన దేవతామూర్తులకు అర్చకులు పూజలు జరిపి హారతులిచ్చారు. శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు జరిగాయి.

10 నుంచి మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష

ఏలూరుటూటౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని ఈనెల 10 నుంచి మున్సిపల్ కార్మికులు రిలేనిరాహార దీక్షలు చేస్తున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూని యన్ నాయకులు బి.సోమయ్య తెలిపారు. గత ఏడాది సమస్యలు పరిష్కరించాలని 17రోజుల పాటు కార్మికులు సమ్మె నిర్వహించారన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతి పత్రం సమర్పించామన్నారు. అయినప్పటికి ఫలితం లేకపోవడంతో దీక్షలు చేపడుతున్నామన్నారు.

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఏలూరుటూటౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈనెల 12 వరకు పొడిగిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ప్రజలు 12వ తేదీ లోపు సంబంధిత అధికారులకు అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 16 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. సర్వే వివరాలను ఈనెల 20న గ్రామ వార్డు సచివాలయాల వద్ద వెల్లడిస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారులు అభ్యంతరాల స్వీకరణను పర్యవేక్షించాలన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పరిశీలన ప్రారంభం

ఏలూరుసిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పరిశీలనలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లాలోని ముసునూరు మండలంలో 48 మంది పింఛన్‌దారులు, చింతలపూడిలో 25 పింఛన్‌దారుల ఇళ్ళకు వెళ్ళి వారి అర్హతలను పరిశీలించారు. గుంటూరు, విజయవాడ, ఒంగోలుకు చెందిన డాక్టర్లు పరిశీలనా కార్యక్రమంలో పాల్గొన్నారు. సంబంధిత నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తా మన్నారు.

వలంటీర్లకు పుస్తకాల పంపిణీ

దెందులూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్యా ఉల్లాస్ అక్షరాస్యత ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా వలంటీర్లు, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏలూరు జిల్లా వయోజన విద్యానోడల్ అధికా రి కేవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం దెందులూరు మండల డ్వాక్రా భవనంలో దెందులూరు ఎంపీడీవో శ్రీదేవి వెలుగు శాఖ ఏపీఎం సురేష్ అధ్యక్షతన వలంటీర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. వెలుగు శాఖ డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.









ప్రహరీ లేని కలిదిండి పీహెచ్‌సీ, కోరుకొల్లు పీహెచ్‌సీ ఆవరణలో పశువుల సంచారం

పీహెచ్‌సీలకు సమస్యల సుస్తీ

- వైద్యులు, సిబ్బంది కొరత
- రోగులకు సౌకర్యాల లేమి
- ప్రహరీ లేని ఆరోగ్య కేంద్రాలు
- ప్రాంగణంలో పశువుల సంచారం

కలిదిండి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీహెచ్‌సీలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది కొరత, సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీల ఆవరణకు ప్రహరీ లేకపోవడంతో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కలిదిండి 24 గంటల పీహెచ్‌సీకి ప్రహరీ లేక పశువులు సంచరిస్తున్నాయి. కొద్దిపాటి వర్షానికే చుట్టుపక్కల నీరు ఆవరణలోకి చేరుతుంది. దీంతో ఆసుపత్రికి వెళ్లే పేషెంట్లు పలు అవస్థలు పడుతున్నారు. రోగుల సంఖ్య అధికంగా ప్రస్తుత ఇరుకు భవనంలో ఇబ్బందులు తప్పడం లేదు. స్టాఫ్ నర్సు కొరత ఉంది. కోరుకొల్లు పీహెచ్‌సీలో నాడు - నేడు పనులు అసంపూర్తిగా జరగడంతో ప్రహరీ కొంత భాగం పనులు పూర్తి చేయకపోవడంతో ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. మూల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసూతి సెలవులో ఉండడంతో కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్టాఫ్ నర్సు కొరత ఉంది. మెడికల్ స్టోర్ రూమ్ లేక ఇబ్బంది పడుతున్నారు. పాత భవనం కావడంతో పేషెంట్లు పలు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రుల పనితీరుపై ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి అభినందనీయం



కలెక్టర్‌ను కలిసిన జయమంగళ

కైకలూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆ భూముల ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మంగళవారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా ఏలూరులో కలిశారు. ఇటీవల కైకలూరు నియోజకవర్గంలో భూసమస్యల పరిష్కారానికై జిల్లా కలెక్టర్‌గా తీసుకున్న చర్యలు అభినందనీయమని అలాగే కొల్లేరు గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కూడా కృషి చేయాలని కోరినట్లు జయమంగళ తెలిపారు.

కోడిపందేల కట్టడికి అధికారుల కసరత్తు

ముదినేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలకు నిర్వాహకులు ప్రయత్నిస్తుండగా, కట్టడి చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. కోడిపందేలు, జూదం నిరోధించే చర్యల్లో భాగంగా పందేలకు దూరంగా ఉండాలని, సాంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవాలని పోలీసు అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు కూడ గ్రామస్థాయిలో నిఘా కమిటీలను ఏర్పాటుచేసి కోడి పందేలను అడ్డుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. మండలంలో పలుచోట్ల పందేలు నిర్వహించేందుకు బరులను పంచుకునే విషయంలో అన్ని పార్టీల నాయకులు తర్జనభర్జన పడుతుండగా, మంగళవారం మండల రెవెన్యూ అధికారులు బరులు ఏర్పాటును ఎలా అడ్డుకోవాలన్న అంశంపై చర్చించారు. కోడిపందేల నిర్వహణ సమాచారం సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్ద ఎత్తున గ్రామాల్లో ప్రచారం చేయాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. సంక్రాంతి పండుగకు కోడిపందేలను అడ్డుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రయత్నిస్తుండగా, పందేల నిర్వాహకులు మాత్రం బరులు ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంక్న హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 40 రోజులకు గాను రూ.3.85 కోట్లు ఆదాయం లభించినట్లు ఆలయ ఇంచార్జ్ ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో మంగళవారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. 3,85,61,549,రూపాయల నగదుతో పాటు 383 గ్రాముల బంగారం, 12.008 కేజీల వెండి లభించినట్లు ఈవో వివ రించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (23), 1000(4) 2000(7)తో పాటు విదేశీ కరెన్సీ సైతం లభించింది.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కేసీహెచ్ సూరిబాబు కోరారు. మంగళవారం సూరేపల్లి, రమణక్కపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ రైతులు పంటలబీమా ప్రీమియాన్ని చెల్లించుకుని ప్రయోజనాలు పొందాలని సూచించారు. మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.483, మినుము పంటకు ఎకరానికి రూ.60, వరికి రూ.500, మామిడి పంటకు రూ.2,250 చొప్పున బీమాప్రీమియంగా రైతులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో జిల్లాలో ప్రథమం : ఏపీఎం

ఆగిరిపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీలో జిల్లాలో ప్రథమస్థానంలో ఉందని, బ్యాంకు లింకేజి రుణాల మంజూరులో కూడా ముందంజలో ఉందని ఏపీఎమ్ దయాల రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య సమావేశం కార్యదర్శి సయ్యద్ బషీరా అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసుకునే ఉత్పత్తులకు 'షైస్టోర్' అనే యాప్‌ద్వారా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల్లాగా ఇంటి వద్దకే డ్వాక్రా ప్రొడక్ట్ సప్లై చేస్తారన్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉంటూ డ్వాక్రా ఉత్పత్తులు తయారుచేసే షైస్టోర్ యాప్‌లో నమోదు చేసుకుని ఆదాయంతో పాటు అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం ఏరియా కో-ఆర్డినేటర్ త్రిపుర సుందర్ మాట్లాడారు. లీగల్ కో-ఆర్డినేటర్ పసిగళ్ళ ప్రసాద్, స్త్రీనిధి మేనేజరు గోపి, సీసీలు దివ్యలక్ష్మి, హుస్సేన్‌బీ, కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు, అకౌంటెంట్ రజిత, వీవో, ఏజెంట్లు పాల్గొన్నారు.

గేదెలు కాస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

చాట్రాయి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో మంగళవారం గేదెలను కాస్తున్న మహిళ మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారం గొలుసును గుర్తుతెలియని దుండగులు బలవంతంగా తెంపుకొని పరారయ్యారు. చీపురుగూడెం-మంకొల్లు రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర తాతినేని కృషకుమారి అనే మహిళ గేదెలను మేపుతుండగా ద్విచక్రవాహనంపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అక్కడ ఆగారు. ఆ రోడ్డుపై ఎవరూ రాకపోవడాన్ని గమనించి గొలుసును లాగుతుండగా ఆమె ప్రతిఘటించినప్పటికీ లాక్కుని వెళ్లిపోయారు. సమాచారం మేరకు చాట్రాయి ఏఎస్‌ఐ గజపతిరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి, బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.



తేరగూడెం సింగిల్ టీచర్ పాఠశాల

సింగిల్ టీచర్ పాఠశాలలో సెలవు కుదరదు!

- ముదినేపల్లి మండలంలో 25 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- టీచర్ సెలవు పెడితే ప్రత్యామ్నాయం లేదు
- అనారోగ్యమైనా విధులు నిర్వహించాల్సిందే!

ముదినేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సెలవుల సమస్య నెలకొంది. ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సాధారణ సెలవులను వినియోగించుకోవడంతోపాటు అత్యవసర సమయాల్లో సెలవు పెట్టుకోవడం ఇబ్బందికరంగా ఉంది. ఉన్న ఒక్క టీచరు సెలవు పెడితే ప్రత్యామ్నాయం కూడ సమస్యగానే పరిణమించింది. ముదినేపల్లి మండలంలో 25 ఏకోపాధ్యాయ పాఠశాలలుండగా, వీటిలో 17 పాఠశాలల్లో మహిళా టీచర్లు, 8 పాఠశాలల్లో పురుషులు సింగిల్ టీచర్లుగా ఉన్నారు. మహిళా టీచర్లు ఉన్న సింగిల్ టీచరు పాఠశాలల్లో సెలవులు పెట్టుకోవటం మరింత జఠిలం. సింగిల్ టీచర్ పాఠశాలలో ఉపాధ్యాయుడు సాధారణ, అత్యవసర సెలవు పెట్టినా సమీప పాఠశాల నుంచి తాత్కాలికంగా ఆ పాఠశాలకు సర్దుబాటుపై ఉపాధ్యాయుడు వెళ్లాలన్నది గతంలో ఎంఈవో సూచించినా అమలు కావడం లేదు. మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలకు సమీపంలో ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలలు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఒక ఉపాధ్యాయుడిని ఒక్కరోజు పంపడం కూడ ఇబ్బందికరంగానే ఉంది. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్ల సెలవు పెడితే ఒక్కోసారి సీఆర్పీ ఆ పాఠశాల బాధ్యతలు నిర్వహించాల్సి వస్తున్నది. ప్రత్యామ్నాయ టీచర్ వచ్చే అవకాశం లేక ఇటీవల మండలంలోని ఒక మహిళా టీచర్ జ్వరంతోనే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సింగిల్ టీచర్‌కు సెలవు మంజూరుచేస్తే ఆ పాఠశాలకు ఒక్కరోజు వెళ్లేందుకు కొందరు ఉపాధ్యాయులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. సింగిల్ టీచర్ స్కూళ్ల నిర్వహణ అగమ్యగోచరంగా తయారైంది.

సీఆర్‌పీల పాట్లు

సింగిల్ టీచర్ స్కూళ్లలో ఉపాధ్యాయుడు సెలవు పెడితే పాఠశాలల నిర్వహణకు సీఆర్‌పీల పాట్లు వర్ణనాతీతం. పాఠశాల మూయకుండ వేరే పాఠశాల నుంచి టీచర్లను ఒకటి, రెండు రోజులు సర్దుబాటు చేయించేందుకు సీఆర్‌పీలు సమీప పాఠశాలల హెచ్ఎంలను అభ్యర్థించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకున్న పని ఒత్తిడితో సతమతమవుతున్న సీఆర్‌సీలకు సింగిల్ టీచర్ స్కూళ్ల నిర్వహణ బాధ్యత మరింత ఒత్తిడిని పెంచింది.



సీబీ కెనాల్‌లో స్వచ్ఛందంగా గుర్రపుడెక్క, తూడు తొలగిస్తున్న రైతులు



తామరకొల్లులో పంటకాలువ అభివృద్ధి పనులు

సీబీ కెనాల్‌లో తూడు తొలగించిన రైతులు

కలిదిండి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిపాలెం వద్ద సీబీ కెనాల్‌లో డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్య నారాయణ ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగా గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను మంగళవారం చేపట్టారు. కొండంగి ఎత్తిపోతల పథకాలను పునఃప్రారంభించడంతో సీబీ కెనాల్‌లో సాగునీరు సరఫరాకు ఆటంకం కలుగకుండా దట్టంగా పేరుకుపోయిన చెత్తాచెదారం రైతులు తొలగిస్తున్నారు. ఎత్తిపోతల ఆవరణలో దట్టంగా పేరుకుపో యిన ముళ్ల పొదలను ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా తొలగించారు. ఎత్తిపోతల ద్వారా నిరాటంకంగా సాగునీరు అందిస్తామన్నారు.

పంట కాలువల అభివృద్ధి

కైకలూరు: రానున్న వేసవిలో కైకలూరు ప్రాంతానికి తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. తామరకొల్లులో పంటకాలువల అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతీ కాలువలో దట్టంగా చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధం ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు గంగుల ఏసురాజు, ఇరిగేషన్ డీఈ శిరీష, ఏఈ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని లోకుముడి, చావలిపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సు ద్వారా రైతులు తమ భూమి సంబంధించిన సమస్యలు, రికార్డులలో సవరణ చేసుకోవచ్చని తెలిపారు. లోకుముడి గ్రామంలో 2 అర్జీలు, చావలిపాడు గ్రామంలో ఒక అర్జీ వచ్చాయని ఆర్ఐ శ్రావణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే లోపాలు సరి చేస్తాం

ముదినేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి అందిన అర్జీల పరిష్కారంలో అలసత్వం ఉండదని తహసీల్దార్ సుభానీ తెలిపారు. ములకలపల్లి, బొమ్మినంపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ రీ సర్వే వల్ల జరిగిన తప్పిదాలను సరి చేసేందుకు, భూముల సబ్ డివిజన్‌కు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బొప్పన సుందరరామయ్య, సర్పంచ్‌లు దారం సుధ, గంటా నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు కేనం ప్రసాద్, రీ సర్వే డీటీ శ్రీనివాస ప్రసాద్, సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అధికారికి వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

పెరిగిన ధరల మేరకు జీతాలు పెంచాలి

నూజివీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్కీమ్ వర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు నిరసన ప్రదర్శన, అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.30 చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం పథకంలో పనిచేస్తున్న ఆయాలను, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన కార్మికులు అంజమ్మ, తహిరున్నీసా, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు

చాట్రాయి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబరు 1 నుంచి ప్రారంభమైన ప్రత్యేక తరగతులు మార్చి 16 వరకు జరగనున్నాయి. ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంల వరకు జరిగే ప్రత్యేక తరగతుల్లో రోజుకో సబ్జెక్ట్‌పై ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. మండలంలో ఏడు జడ్పీ హైస్కూల్స్, మూడు ప్రైవేట్ పాఠశాలలో ఈ ఏడాది టెన్త్ విద్యార్థులు 430 మంది ఉండగా అందరూ ఉత్తీర్ణత సాధించటం, మెరిట్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం కోసం ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారు.

నూజివీడులో అక్రమ మైనింగ్ జరగలేదు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నూజివీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరగలేదని, కొండపర్వ గ్రామంలో ఒక ఎకరం పొలంలో ఉన్న పెద్దదిబ్బను ఉచితంగా అవసరమైన చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని రైతులకు గ్రావెల్, మట్టి ఇవ్వడం జరిగిందని నూజివీడు నియోజకవర్గ మాజీ ఏఎంసీ చైర్మన్, రావిచర్ల గ్రామసర్పంచ్ కాపా శ్రీనివాసరావు అన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరగడం లేదని, ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో జరుగుతున్న మైనింగ్ విషయాన్ని విషయం మంత్రి పార్థసారథి దృష్టికి గాని, నియోజకవర్గ నాయకుల దృష్టికి కాని రాలేదన్నారు. ఒకవేళ జరిగితే కనుక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నూజివీడు మండల టీడీపీ అధ్యక్షుడు ముసునూరు రాజా, తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు గద్దెరఘు, ముసునూరు మండల తెలుగుదేశం నాయకుడు కొల్లి గంగారామ్ ఉన్నారు.

దివ్యాంగ పింఛన్లపై వైద్య బృందం తనిఖీలు



చెక్కపల్లిలో దివ్యాంగ పింఛన్‌ను తనిఖీ చేస్తున్న వైద్య బృందం

ముసునూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన దివ్యాంగ పింఛన్‌లపై కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక వైద్యబృందం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న 48 డీఎంహెచ్‌వో దివ్యాంగ పింఛన్‌లపై విజయవాడ నుంచి వచ్చిన వైద్యులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అంగవైకల్యం పింఛన్ నిమిత్తం మంజూరు చేసిన ధ్రువపత్రాలు తదితర వాటిని ప్రత్యేక వైద్యబృందం పరిశీలించింది. డీఎంహెచ్‌వో పింఛన్ రూ.15వేలు అందుతున్న లబ్ధిదారులు ఈ పింఛన్‌కు అర్హులా ? కాదా? ఏమైనా అవకతవకలు జరిగాయా? తదితర అంశాలపై ప్రత్యేక వైద్యబృందం తనిఖీలు చేసి సమగ్ర నివేదికను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు అందిస్తామని వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో ఎంపీ డీవో జి.రాణి, ఈవోపీఆర్‌డీ బీవీ సత్యనారా యణ, ముసునూరు, రమణక్కపేట, వైద్య అధికారులు షకీనా ఇవాంజలి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రంగోత్సవ్‌లో త్రివిధ విద్యార్థులకు బహుమతులు



ప్రతిభ కనబరిచిన త్రివిధ విద్యార్థులు

నూజివీడు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి రంగోత్సవ్‌లో త్రివిధ విద్యార్థులు ఉత్తమ ప్రతిభాపాటవాలను కనబరిచారు. అంగలూరు డైట్ కళాశాలలో నిర్వహించిన రంగోత్సవ్ కార్యక్రమంలో త్రివిధ విద్యార్థులు క్విజ్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్‌లలో మొదటి బహుమతులు పొందారు. డ్రాయింగ్‌లో, ఏక పాత్రాభినయంలో ద్వితీయ బహుమతులు పొందినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



ముసునూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహాజ్ఞాని లూయిస్ బ్రెయిలీ అని హెచ్ఎం పి.వి.ఎస్ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను రమణక్కపేట మెయిన్ పాఠశాలలో గల భవిత సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి హెచ్ఎం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు సురేష్ బాబు, కొండయ్య, సీఆర్ఎంటీ దాసు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.



కృష్ణ యాదవ సేవా సంఘ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న హరికుమార్ యాదవ్

యాదవుల సంక్షేమానికి మరిన్ని సేవా కార్యక్రమాలు

ముదినేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యాదవ సామాజిక వర్గీయుల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని యాదవ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ అన్నారు. మండల శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సోమా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హరికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల తాతారావు యాదవ్, కేశంశెట్టి అజయ్ కుమార్, బత్తుల ప్రసాద్, కంతేటి హరిబాబు, కారుమూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు సోమా సత్యనారాయణను సన్మానించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మండవల్లి జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామలింగేశ్వరరావు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు తప్పకుండా పాల్గొనాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై దాడి

కలిదిండి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాలెంలో మంగళవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

ట్రాక్టర్‌పై గడ్డి లోడు దగ్ధం

కైకలూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌పై గడ్డి లోడు దగ్ధం కావడంతో రూ.20వేలు ఆస్తినష్టం వాటిల్లింది. వింజరంలో మంగళవారం గడ్డి లోడు ట్రాక్టర్ వెళుతుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు రేగాయి. గడ్డి అంటుకోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధం కావడంతో రూ.20వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్ తెలిపారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

చాట్రాయి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 45 మంది టెన్త్ విద్యార్థులకు, ఇదే గ్రామంలో మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.రవికుమార్ మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. టెన్త్ విద్యార్థులు మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఎస్టీయూ ఏపీ ముద్రించిన స్టడీ మెటీరియల్ సొంత నిధులతో కొనుగోలు చేసి అందజేశామని దాత రవికుమార్ చెప్పారు. హెచ్ఎం విశ్వభారతి, ఎస్టీయు జిల్లా నాయకులు సత్తెనపల్లి రాము, జి.అమరయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడి రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తామరపురుగుల పెరుగుదలకు అనుకూలంగా ఉండడం వల్ల మామిడి రైతులందరూ ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారిణి కె.జ్యోతిప్రియాంక సూచించారు. ప్రస్తుతం మామిడిపూత పిందె దశలో ఉన్నందు వల్ల తామరపురుగులు ఎక్కువగా నష్టపరిచే అవకాశం ఉందని కృష్ణవరం, సూరవరం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తామరపురుగు నివారణ చర్యలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండల ఉద్యానశాఖ అధికారిణి కె.జ్యోతిప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

కళ్లల్లో కారం కొట్టి కత్తితో దాడి

నూజివీడు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కళ్ళల్లో కారంకొట్టి కత్తితో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటన నూజివీడు పట్టణంలోని కృష్ణవిలాస్ కాలనీలో జరిగింది. వివరాలిలా.. కాలనీకి చెందిన సాంబశివరావుపై పాత గొడవల నేపథ్యంలో బాబి అనే వ్యక్తి ఎవరూలేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి కారంకొట్టి కత్తితో దాడిచేశాడు. సాంబశివరావు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వస్తారనే భయంతో అక్కడినుంచి పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన సాంబశివరావును స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యసేవలను అందిస్తున్నారు.